



తెలుగు దినపత్రిక

సాక్షర

చదువు..సమీక్షించు

RNI NO.APTEL/2011/42149

ఆదిలాబాద్ | సంపుటి : 16 సంచిక : 277 మంగళవారం, నవంబర్ 10, 2026 ఎడిటర్: ఎ. లింగన్న | పేజీలు : 8 రూ. 2.00

దీపావళి శుభాకాంక్షల్లో వివాదం..

- ఖర్గే వ్యాఖ్యలపై బీజేపీ తీవ్ర అభ్యంతరం
- మతపరమైన బుజ్జగింపులు అంటూ కాంగ్రెస్‌పై బీజేపీ ఆరోపణలు
- ఈద్‌తో పోల్చడంపై భాటియా అభ్యంతరం
- దీపావళిని 'ఖుషియోన్ కీ ఈద్' అన్న ఖర్గే
- హిందువుల మనోభావాలు దెబ్బతీశారన్న కేశవన్
- ఐక్యత కోసమే ఆ పదం వాడారన్న కాంగ్రెస్

కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేసిన ఓ వ్యాఖ్య ఇప్పుడు దేశ రాజకీయాల్లో వివాదానికి దారితీసింది. దీపావళిని 'ఖుషియోన్ కీ ఏక్ ఈద్' (సంతోషాల పండగ)గా అభివర్ణించడంపై బీజేపీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. మైనారిటీలను ఆకట్టుకునేందుకు కాంగ్రెస్ మతపరమైన బుజ్జగింపు రాజకీయాలకు పాల్పడుతోందని ఆరోపించింది. అయితే 'అన్ని వర్గాల ప్రజలు కలిసి జరుపుకొనే సంతోషాల పండగ' అనే ఉద్దేశంతోనే ఖర్గే ఆ పదాన్ని ఉపయోగించారని కాంగ్రెస్ నేతలు వివరణ ఇచ్చారు. దీపావళి సందర్భంగా మీడియాతో మాట్లాడిన ఖర్గే.. దేశ ప్రజలందరికీ పండగ శుభాకాంక్షలు తెలిపారు. దీపావళి దేశమంతటా అందరూ జరుపుకొనే పెద్ద పండగని, సంతోషాలను పంచే వేడుకని పేర్కొన్నారు. దీర్ఘకాలం పాటు కొనసాగే ఆనందోత్సవమని చెబుతూ 'ఖుషియోన్ కీ ఏక్ ఈద్' అనే పదాన్ని ఉపయోగించారు. పండగ వేళ ప్రజల మధ్య ఐక్యత పెరగాలని, సామాజిక విభేదాలు తొలగిపోవాలని పిలుపునిచ్చారు. ఖర్గే వ్యాఖ్యలపై బీజేపీ నేతలు మండిపడ్డారు. హిందువుల పవిత్ర పండగ దీపావళిని మరో మతానికి చెందిన పండగతో పోల్చడం ద్వారా కోట్లాది మంది హిందువుల మనోభావాలను కాంగ్రెస్ దెబ్బతీస్తోందని బీజేపీ అధికార ప్రతినిధి సీఆర్ కేశవన్ ఆరోపించారు. మిగతా 2 లో



ఇరాన్‌పై మళ్లీ యుద్ధం..అత్యంత అసంభవం:ట్రంప్



ఇరాన్‌తో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌తో మరోసారి యుద్ధం చేయాల్సిన పరిస్థితి తలెత్తే అవకాశాలు అత్యంత తక్కువ అని అన్నారు. అయితే.. ఇరాన్ అణు కార్యక్రమంపై చర్చలు, హోర్మూజ్ జలసంధిని మళ్లీ తెరిచే అంశాలపై గట్టి ఒప్పందం కుదరాల్సిందేనని స్పష్టం చేశారు. పూర్తిగా 2 లో

హైదరాబాద్ లో దాహం కేకలు....



(హైదరాబాద్ , సాక్షర): హైడ్రా ఇప్పుడు తన ఫుల్ ఫోకస్ ను హైదరాబాద్ లోని నీటి ట్యాంకర్ల మాఫియాపై పెట్టింది. భూగర్భ జలాలను దోపిడీ చేస్తూ.. అక్రమ వాటర్ ట్యాంకర్ మాఫియా వసూలు చేస్తున్న అడ్డగోలు దందాపై దృష్టిసారించింది. హైదరాబాద్ పరిధిలో అనుమతులు లేకుండా వేస్తున్న లోతైన బోర్లు.. వాటి ద్వారా సాగుతున్న అపరిమిత నీటి వ్యాపారంపై నిఘా పెట్టేందుకు హైడ్రా కమిషనర్ రంగనాథ్ రంగం సిద్ధం చేస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్ లో పరిస్థితి ఎలా ఉందంటే.. వివిధ కంపెనీలు, విద్యాసంస్థలు నీటి కొరతతో సెలవులు ఇస్తూ విద్యార్థులు, ఉద్యోగులను ఇంటికి పంపించేస్తున్నాయి. ముఖ్యంగా మాదాపూర్, గచ్చిబౌలి, కొండాపూర్, నానక్ రామ్ గూడ వంటి ఐటీ కారిడార్లలో భూగర్భ జలాలు ప్రమాదకర స్థాయికి పడిపోవడంతో స్థానిక బోర్లు పూర్తిగా ఎండిపోయాయి. పూర్తిగా 3 లో

రాజకీయాలకు అతీతంగా.. కరీంనగర్ అభివృద్ధే లక్ష్యం



(కరీంనగర్, సాక్షర): కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ లో రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యటించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ తో కలిసి 46వ డివిజన్ లో యూడిఐఎఫ్ నిధులతో 1.5 కోట్ల తో బాక్స్ టైప్ డ్రైన్ నిర్మాణానికి శంకుస్థాపన చేసారు. ఈ కార్యక్రమంలో మేయర్ కొలగని శ్రీనివాస్, స్థానిక కార్పొరేటర్ మల్లికార్జున రాజేందర్, మున్సిపల్ కమిషనర్ ప్రపుల్ దేశాయ్, లైబ్రరీ చైర్మన్ సత్తు మల్లేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నర్సయ్య ఇతర ముఖ్య నేతలు, అధికారులు పాల్గొన్నారు. పూర్తిగా 3 లో

ధాన్యం నిల్వల కోసం ఆధునిక సైలోలు



(వరంగల్, సాక్షర): పంట చేతికొచ్చిన వెంటనే ధాన్యాన్ని తక్కువ ధరకు విక్రయించాల్సిన పరిస్థితుల నుంచి రైతులను గట్టెక్కించేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక ప్రణాళిక రూపొందిస్తోంది. రైతులు తమ ధాన్యాన్ని నిల్వ చేసుకుని మార్కెట్లో మంచి ధర వచ్చినప్పుడు విక్రయించుకునేలా రాష్ట్రవ్యాప్తంగా ఆధునిక సైలోలు (భారీ ధాన్యం నిల్వ కేంద్రాలు) ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. పూర్తిగా 2 లో

ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

(రాజన్న సిరిసిల్ల, సాక్షర): ప్రజావాణిలో ప్రజలు సమర్పించే దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి అదనపు కలెక్టర్ హాజరై ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించారు. దరఖాస్తులను పెండింగ్ లో ఉంచకుండా చూడాలని, ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణికి మొత్తం 66 దరఖాస్తులు వచ్చాయి.ప్రజావాణిలో జిల్లా రెవెన్యూ అధికారి జయశ్రీ, తదితరులు పాల్గొన్నారు.. 2 లో

వర్క్ ఫ్రం పార్క్' కాన్సెప్ట్

(హైదరాబాద్ , సాక్షర): రోజూ నాలుగు గోడల మధ్యే కూర్చొని ఉద్యోగం చేయడం కష్టంగా అనిపిస్తోందా? 'వర్క్ ఫ్రం హోమ్'తో విసిగిపోయి కొత్తదనం కోరుకుంటున్నారా? అలాంటి వారి కోసం సైబరాబాద్ నగరపాలక సంస్థ (సీఎంసీ) ఒక నూతన విధానానికి శ్రీకారం చుట్టింది. దుబాయ్‌లో సక్సెస్ అయిన 'వర్క్ ఫ్రం పార్క్' థీమ్‌ను సైబరాబాద్‌లోనూ అందుబాటులోకి తీసుకొస్తోంది. ఐటీ ఉద్యోగులు, వ్యాపారులు, స్టార్టప్‌ల నిర్వాహకులు ప్రశాంతమైన వాతావరణంలో పని చేసుకునేందుకు వీలుగా పార్కులను సకల సౌకర్యాలతో తీర్చిదిద్దుతోంది.కార్పొరేషన్ పరిధిలో మొత్తం 30 పార్కులను 'వర్క్ ఫ్రం పార్క్' కాన్సెప్ట్‌తో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. 3 లో

హార్వెస్టర్ లీజు పేరుతో కిడ్నాప్ డ్రామా

(కామారెడ్డి, సాక్షర): హార్వెస్టర్ మిషన్లు లీజుకు ఇస్తామంటూ నమ్మించి ఓ వ్యక్తిని కిడ్నాప్ చేసిన ఘటన కామారెడ్డి జిల్లాలో కలకలం రేపింది. బాధితుడిని కిడ్నాప్ చేసిన నిందితులు రూ.10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ దాడికి పాల్పడ్డారు. జైలులో పరిచయమైన నలుగురు కలిసి ఈ నేరానికి పథకం రచించారు. నెల రోజుల పాటు నకిలీ పేరుతో ఫోన్‌లో మాట్లాడి బాధితుడిని నమ్మించారు. అనంతరం కారులో కిడ్నాప్ చేశారు. నిందితుల నుంచి తప్పించుకున్న బాధితుడిపై మరోసారి కిడ్నాప్‌కు యత్నిస్తుండగా పోలీసులు వారిని పట్టుకున్నారు. 2 లో

ఉమ్మడి అదిలాబాద్ లో నీటి గండం



(అదిలాబాద్, సాక్షర): బాసరలో గోదావరి నీటిపై ఆధారపడిన గ్రామాలకు రానున్న రోజుల్లో తాగునీటి ఇబ్బందులు తప్పేలా లేవు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొనడం, గోదావరిలో నీటిమట్టం రోజురోజుకూ తగ్గుతుండటంతో ఆందోళన వ్యక్తమవుతోంది. బాసర అమ్మవారి ఆలయానికి వచ్చే భక్తులతోపాటు చుట్టుపక్కల గ్రామాలు, నిజామాబాద్ జిల్లాలోని సుమారు 108 గ్రామాలకు గోదావరి నుంచే నీటిని సరఫరా చేస్తున్నారు. పూర్తిగా 3 లో

గ్రేటర్ లో 15 ఏళ్ల క్రితం జీవోలతోనే నిర్మాణాలు



- అప్ డేట్ కానీ సిటీ కార్పొరేషన్

(హైదరాబాద్, సాక్షర): హైదరాబాద్‌లో ఇళ్ల నిర్మాణాలకు కొత్త సమస్య వచ్చి పడింది. 20 అడుగుల కంటే తక్కువ రహదారి వెడల్పు ఉన్న నివాస స్థలాలకు నిర్మాణ అనుమతులు ఇవ్వకూడదనే 14 ఏళ్ల క్రితం నాటి జీవోను కఠినంగా అమలు చేయడంతో వివాదం మొదలైంది. ముఖ్యంగా పాతబస్తీలో 60 నుంచి 70 చదరపు గజాల స్థలాల్లో ఉన్న పాత ఇళ్లను తిరిగి నిర్మించుకోవాలనుకునేవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. 3 లో

తెలంగాణ జీవనాడి కాళేశ్వరం ప్రాజెక్టు

- కేసీఆర్ కు పేరు వస్తుంది అని నీళ్ళు ఎత్తలేదు ఎమ్మెల్యే డి .సుధీర్ రెడ్డి



(హైదరాబాద్, సాక్షర): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ కన్నెపల్లి ,మేడిగడ్డ బ్యారేజ్ దగ్గర పోయిన వాళ్లను తీవ్రమైన పదజాలంతో మాట్లాడాడు. బర్రెలు కాసేవారు చిన్నవారు కాదు.....వాళ్ళు పైసా పైసా కూడబెట్టి మంచి ఉన్నతమైన స్థానం కు ఎదిగారు. నన్ను బర్రెలు కాసేవారు అంటే నేను బాధపడను. నివు మాత్రం ఎలాంటి కష్టం లేకుండా భూమిపై కన్నువేసి అక్రమంగా సంపాదించినవని ఎమ్మల్యే సుధీర్ రెడ్డి అన్నారు. సోమవారం అయన మీడియాతో మాట్లాడారు. మేము కన్నెపల్లి మేడిగడ్డ బ్యారేజ్ సందర్శించి నీళ్ళు పోతున్నాయి ఎత్తండి అన్నాం. ఇరువై వేల క్యూసెక్కుల నీటి ప్రవాహం ఉన్నది ఎత్తండి అని మేము చెప్పడం జరిగింది. ఎన్డీఎస్ఎ కూడా రిపోర్ట్ కన్నెపల్లి నుండి నీటిని లిఫ్ట్ చేయచ్చు అని చెప్పింది. రాష్ట్రంలో ఉన్న కరువు కరణం కాంగ్రెస్ పార్టీ రేవంత్ రెడ్డి ఎందుకంటే ఉన్న నీళ్లను ఎత్తకుండా కిందికి వదిలారు. నీకు కక్ష్యసాదింపు లో బాగంగా కేసీఆర్ కు పేరు వస్తుంది అని నీళ్ళు ఎత్తలేదు గత వర్షాకాలంలో నీళ్లు ప్రవాహం ఎంత ఉన్నదో తెలుసు. 93. 3 లో

ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు రైతులు పంటల మార్పిడిపై దృష్టి



(మెదక్, సాక్షర): నర్సాపూర్ మండలం రాంచంద్రాపురం గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సమగ్ర పశుసంవర్ధక శిబిరంలో మంత్రి వివేక్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు , నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి, తదితరులు హాజరయ్యారు. పూర్తిగా 3 లో

మొదటి పేజీ తరువాయి గ్రేటర్ లో 15 ఏళ్ల క్రితం జీవోలతోనే నిర్మాణాలు

నిరసనల నేపథ్యంలో ప్రభుత్వం సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేసి దరఖాస్తుల స్వీకరణకు అవకాశం కల్పించింది. అయితే అనుమతులు ఇచ్చే ముందు అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేయనున్నారు. చిన్న స్థలాల్లో భద్రత, మౌలిక సదుపాయాలు దెబ్బతినకుండా చూడాలన్నది అధికారుల వాదన కాగా, పేద, మధ్యతరగతి కుటుంబాలకు వెసులుబాటు కల్పించాలని రియల్టర్లు కోరుతున్నారు.హైదరాబాద్‌లో పాత ఇళ్ల పునర్నిర్మాణానికి భవన నిర్మాణ నిబంధనలు అడ్డంకిగా మారాయి. దాదాపు 14 ఏళ్ల క్రితం తీసుకొచ్చిన 20 అడుగుల ప్లాట్ వెడల్పు నిబంధనను రాష్ట్ర ప్రభుత్వం బిల్డ్‌నౌ సాఫ్ట్‌వేర్ ద్వారా కఠినంగా అమలు చేయడంతో చిన్న స్థలాల యజమానులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా పాతబస్తీతో పాటు హైదరాబాద్ నగరంలోని పాత కాలనీల్లో ఈ నిబంధన ప్రభావం ఎక్కువగా కనిపిస్తోంది. దీంతో మధ్యతరగతి, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలు ఇళ్లను పునర్నిర్మించుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా భవన నిర్మాణాలకు సంబంధించి ప్రభుత్వం 2012 ఏప్రిల్‌లో జీవో 168ను జారీ చేసింది.దీని ప్రకారం నివాస స్థలానికి రహదారి వైపు కనీసం 20 అడుగుల వెడల్పు ఉండాలి. అంతకంటే తక్కువ వెడల్పు ఉన్న స్థలాల్లో భవన నిర్మాణ అనుమతులు మంజూరు చేయకూడదనే నిబంధనను ఇందులో పొందుపరిచారు. భవనాల ఎత్తు, రహదారుల వెడల్పు, సెట్‌బ్యాక్‌లు వంటి అంశాలనూ ఈ నిబంధనలు నియంత్రిస్తాయి. అయితే ఈ నిబంధన దాదాపు 14 ఏళ్లుగా అమల్లో ఉన్నప్పటికీ.. క్షేత్రస్థాయిలో అధికారులు గతంలో అంత కఠినంగా అమలు చేయలేదు. చిన్న స్థలాల్లోనూ నిర్మాణాలకు అనుమతులు ఇచ్చేవారు.ఇటీవల హైదరాబాద్ నగరంలో భవనాలు కూలిన ఘటనలు చోటుచేసుకోవడంతో భద్రతా అంశాలపై అధికారులు దృష్టి సారించారు. దీంతో బిల్డ్‌నౌ సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేసి.. రహదారికి ఎదురుగా 20 అడుగుల కంటే తక్కువ వెడల్పు ఉన్న స్థలాల దరఖాస్తులను ఆటోమేటిక్‌గా తిరస్కరించే విధంగా రూపొందించారు. ఈ నిర్ణయంతో హైదరాబాద్ పాతబస్తీ, పాత నివాస ప్రాంతాల్లోని చిన్న స్థలాల యజమానులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అక్కడ చాలా ఇళ్లు దశాబ్దాల క్రితమే 60 నుంచి 70 చదరపు గజాలు లేదా అంతకంటే తక్కువ విస్తీర్ణంలో నిర్మించారు.వీటిలో అనేక స్థలాలకు రహదారి వైపు 20 అడుగుల కంటే తక్కువ వెడల్పు ఉంది. పాత ఇళ్లను కూల్చి తిరిగి నిర్మించుకోవాలనుకున్నా సాఫ్ట్‌వేర్ దరఖాస్తులను స్వీకరించకపోవడంతో యజమానులు నిరసన వ్యక్తం చేశారు. ఈ నిబంధన వల్ల పెద్ద స్థలాలు కొనుగోలు చేసే ఆర్థిక స్థోమత లేని మధ్యతరగతి, పేద కుటుంబాలే ఎక్కువగా నష్టపోతాయని రియల్టర్లు వాదిస్తున్నారు. ఇప్పటికే ఉన్న ఇళ్లను పునర్నిర్మించుకునే విషయంలోనూ వెసులుబాటు కల్పించాలని కోరుతున్నారు.మరోవైపు.. చిన్న స్థలాల్లో నిర్మాణాలను నియంత్రించడం పట్టణ ప్రణాళికలో భాగమని అధికారులు చెబుతున్నారు. పెద్ద స్థలాలను చిన్న చిన్న భాగాలుగా విభజించి నిర్మాణాలు చేపట్టడం వల్ల నగర అభివృద్ధి అస్తవ్యస్తంగా మారుతోందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కొన్ని రియల్ ఎస్టేట్ సంస్థలు 200 చదరపు మీటర్లకు మించిన స్థలాలకు వర్తించే తనఖా నిబంధనను తప్పించుకునేందుకు ప్లాట్లను చిన్నవిగా విభజిస్తున్నాయని మున్సిపల్ శాఖకు చెందిన ఓ ఉన్నతాధికారి పేర్కొన్నారు.చాలా ఇరుకైన స్థలాల్లో ఇళ్లు నిర్మించడం వల్ల గదుల పరిమాణం.. గాలి, వెలుతురు, డ్రైనేజీ, ఇతర మౌలిక సదుపాయాల కల్పనలో సమస్యలు తలెత్తుతాయని అధికారులు చెబుతున్నారు. ఇరుకైన వీధులు, నడిచేందుకు తగిన స్థలం లేకపోవడం, భవన భద్రతకు సంబంధించిన సమస్యలు కూడా పెరుగుతాయని వివరిస్తున్నారు. నిబంధన అమలుపై తీవ్ర వ్యతిరేకత రావడంతో ప్రభుత్వం బిల్డ్‌నౌ సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేసినట్లు అధికారులు తెలిపారు. ఇప్పుడు 20 అడుగుల కంటే తక్కువ వెడల్పు ఉన్న స్థలాలకు కూడా దరఖాస్తులు స్వీకరిస్తున్నామని మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ చీఫ్ సిటీ ప్లానర్ కె. ప్రదీప్ కుమార్ వెల్లడించారు.అయితే దరఖాస్తు స్వీకరించినంత మాత్రాన అనుమతి లభించినట్లు కాదని.. టౌన్ ప్లానింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో స్థలాన్ని పరిశీలించిన తర్వాతే తుది నిర్ణయం తీసుకుంటారని స్పష్టం చేశారు. పాత భవనాల పునర్నిర్మాణానికి సంబంధించి కొంత వెసులుబాటుతో వ్యవహరించాలని అధికారులకు సూచించినట్లు మున్సిపల్ శాఖ వర్గాలు తెలిపాయి. 75 చదరపు గజాల స్థలాల్లో సెట్‌బ్యాక్‌లు వదలకుండా ఇళ్లు నిర్మించుకునే అవకాశం ఉందని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో అనుమతులు రావడం లేదని తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నారగోని ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు.మొత్తంగా 20 అడుగుల నిబంధన అమలు, పాత ఇళ్ల పునర్నిర్మాణానికి కల్పించే వెసులుబాటు మధ్య సమతుల్యత సాధించడం అధికారులకు సవాలుగా మారింది. సాఫ్ట్‌వేర్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయి పరిశీలనలో ఎలాంటి ప్రమాణాలు పాటిస్తారన్నది చిన్న స్థలాల యజమానులకు కీలకంగా మారింది.

మొదటి పేజీ తరువాయి ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు రైతులు పంటల మార్పిడిపై దృష్టి పెట్టాలి మంత్రి వివేక్

ఈ సందర్భంగా పశువులు, గొర్రెలకు వ్యాధి నివారణ మందులను పంపిణీ చేసి, పశువైద్య సేవల గురించి అధికారులను మంత్రి అడిగి తెలుసుకున్నారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తగ్గి, భూగర్భ జలమట్టాలు పడిపోతున్న నేపథ్యంలో రైతులు నీటి లభ్యతను బట్టి పంటలు సాగు చేయాలని, వరికి ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలపై దృష్టి పెట్టాలని సూచించాను. వ్యవసాయంతో పాటు పశుపోషణను అభివృద్ధి చేసుకుని అదనపు ఆదాయం పొందాలని కోరారు. . రైతుల సమస్యలపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని, అన్ని రాజకీయ పార్టీలతో అఖిలపక్ష బృందంగా ఢిల్లీకి వెళ్లి ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారిని కలిసి సహాయం కోరుతామని తెలియజేశారు. మా నాన్నగారు కాకా వెంకటస్వామి గారు కలలుగన్న ప్రాణహిత ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లేందుకు మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు జరపాల్సిన అవసరం ఉందని పేర్కొన్నాను. సాగునీటి సమస్య పరిష్కారానికి రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసి పనిచేయాలని కోరారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో సాంకేతిక పరీక్షలు, నీటి నిల్వ, విద్యుత్ అవసరాలను పరిశీలించి నిర్ణయాలు తీసుకోవాలని వివరించారు. మెదక్ జిల్లా తాగునీటి అవసరాలకు సింగూరు జలాలను వినియోగించే అంశంపై నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిరితో మాట్లాడి ప్రాధాన్యత ఇచ్చేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ , ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు, పశుపోషకులు పాల్గొన్నారు.

మధ్యప్రదేశ్‌లో దీపావళి విషాదం..



- 2 ప్రమాదాల్లో 12 మంది మృతి..

భోపాల్: మధ్యప్రదేశ్‌లో దీపావళి రాత్రి పెను విషాదం చోటుచేసుకున్నది. రెండు వేర్వేరు అగ్నిప్రమాద ఘటనలు జరిగాయి. ఆ ప్రమాదాల్లో 12 మంది మృతిచెందారు. రెండు కుటుంబాలు పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. కట్నీ, సియోని జిల్లాల్లో ఆదివారం రాత్రి ఈ ప్రమాదాలు జరిగాయి. కట్ని జిల్లాలోని బర్హి పట్టణంలో ఓ అగర్వాల్ కుటుంబానికి చెందిన ఆరుగురు అగ్నిప్రమాదానికి బలయ్యారు. మూడు అంతస్తుల భవనంలో కింద క్రాకర్ షాపు ఉన్నది. అయితే పైఅంతస్తులో ఓ కుటుంబం నివసిస్తోంది. రాత్రి ప్రమాదం జరగడంతో మంటలు పైకి వ్యాపించాయి. నిద్రిస్తున్న సమయంలో ప్రమాదం జరగడంతో ఆరుగురు కాలి బూడిదయ్యారు. మృతులను పూరన్ అగర్వాల్, చంద్రకళ, పూనమ్, ఆర్యా, అన్వీగా గుర్తించారు. ఇద్దరు ప్రాణాలతో బయటపడ్డారు. తెల్లవారుజామున మృతదేహాలను వెలికితీశారు. షార్ట్ సర్క్యూట్ లేదా దీపాల వల్ల ప్రమాదం జరిగి ఉంటుందని భావిస్తున్నారు. ఇక సియోనీ జిల్లాలోని చాపారా పట్టణంలో మరో ప్రమాదం జరిగింది. ఓ నగల వ్యాపారి ఇంట్లో ప్రమాదం జరగడంతో ఆరుగురు మృతిచెందారు. మృతులను కుందన్ లాల్ సోనీ, రాజ్‌కుమారి సోనీ, రీతూ సోనీ, స్మృతి సోనీ, సూర్య సోనీ, ఆదిత్య సోనీగా గుర్తించారు. మరో నలుగురు ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. అగ్నిప్రమాద సమయంలో ఇంట్లో పది మంది ఉన్నారు. గాఢ నిద్రలో ఉనప్పుడు ప్రమాదం జరిగిందని పోలీసులు చెబుతున్నారు. రెండు ఘటనలు మధ్యప్రదేశ్‌లో తీవ్ర విషాదాన్ని నింపాయి.

రెండు చార్జిషీట్ల కోసం రూ.2 లక్షల లంచం..!

- ఏసీబీకి రెడ్‌హ్యాండెడ్‌గా చిక్కిన కీసర ఎస్ఐ..
- పోలీస్ శాఖలో కలకలం..



రెండు కేసుల్లో చార్జిషీట్లు త్వరగా దాఖలు చేసేందుకు రూ.2 లక్షలు లంచం డిమాండ్ చేసిన కీసర ఎస్ఐ శ్రీనివాస్ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. భూ మోసం, 498ఏ కేసుల్లో చార్జిషీట్లు ఆలస్యం కాకుండా ఉండాలంటే డబ్బులు ఇవ్వాలని ఎస్ఐ ఒత్తిడి చేస్తున్నట్లు బాధితుడు ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశాడు. దీంతో రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు సోమవారం కీసరలోని శిల్పా లేఅవుట్ వద్ద లంచం తీసుకుంటుండగా శ్రీనివాస్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. విచారణ అనంతరం నిందితుడిని న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. గత మూడు నెలల్లో ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు, ఎస్ఐ జ్ఞానేందర్ రెడ్డి కూడా లంచం కేసుల్లో పట్టుబడటంతో పోలీస్ శాఖలో ఈ ఘటనలు చర్చనీయాంశంగా మారాయి.

మొదటి పేజీ తరువాయి వర్క్ ఫ్రం పార్క్' కాన్సెప్ట్

తొలి విడతలో రెండు చోట్ల పనులు ప్రారంభమయ్యాయి.ఇంటి నుంచే పనిచేసే ఐటీ ఉద్యోగులకు సైబరాబాద్ అధికారులు మరో కొత్త అవకాశం కల్పించేందుకు సిద్ధమవుతున్నారు. అదే 'వర్క్ ఫ్రమ్ పార్క్'. ఇప్పటివరకు ఇంట్లో లేదా ఆఫీస్‌లో పనిచేసిన ఉద్యోగులు ఇకపై పార్కుల్లో కూర్చొని కూడా తమ పనులు చేసుకునేలా ఏర్పాట్లు చేస్తున్నారు. చాలామందికి ఇంటి నుంచి పనిచేయడం సౌకర్యంగానే ఉన్నా, రోజంతా నాలుగు గోడల మధ్య ఉండటం కొన్నిసార్లు విసుగు తెప్పిస్తుంది. బయటకు వెళ్లి పనిచేయాలనుకున్నా సరైన ప్రదేశం దొరకడం కష్టం. ఇక ఆఫీస్‌కు వెళ్లాలంటే హైదరాబాద్ ట్రాఫిక్‌లోనే చాలా సమయం గడిచిపోతుంది. ఇలాంటి వారికి ఇంటికి దగ్గరలోని పార్కులో పనిచేసే అవకాశం కల్పించడం మంచి ఆలోచనే ముఖ్యంగా ఫ్రీలాన్సర్లు, ఇంటి నుంచి పనిచేసే ఉద్యోగులు, చిన్న కంపెనీల్లో పనిచేసేవారికి ఈ సదుపాయం ఉపయోగపడవచ్చు. రోజూ ఒకే చోట కూర్చొని పనిచేయకుండా, అప్పుడప్పుడు వాతావరణం మార్చుకునే అవకాశం ఉంటుంది. అయితే ఇది అందరికీ సరిపోతుందని చెప్పలేం. రోజంతా ఆన్‌లైన్ మీటింగ్స్‌లో ఉండేవారికి, ముఖ్యమైన సమాచారంతో పనిచేసేవారికి పార్కుల్లో ఇబ్బందులు ఎదురుకావచ్చు. అందుకే వైఫై, ఛార్జింగ్ పాయింట్లు ఏర్పాటు చేయడంతో పాటు ప్రశాంతంగా పనిచేసుకునే వాతావరణం కల్పించడం ముఖ్యం. ఎండ, వర్షం నుంచి రక్షణ కూడా ఉండాలి. ప్రస్తుతం రెండు పార్కుల్లో ఈ సదుపాయాన్ని ప్రారంభించాలని అధికారులు చూస్తున్నారు. అక్కడ ఉద్యోగుల నుంచి ఎలాంటి స్పందన వస్తుందో చూడాలి. వారికి నిజంగా ఉపయోగపడితే మరిన్ని పార్కులకు విస్తరించవచ్చు. లేదంటే ఇది కేవలం కొత్త ఆలోచనగానే మిగిలిపోయే అవకాశం ఉంది. మజీద్‌బండ (మాధవహిల్స్)- శేరిలింగంపల్లి జోన్‌లోని 1.5 ఎకరాల పార్కుమాదాపూర్-కూకట్‌పల్లి పరిధిలోని 1 ఎకరా విస్తీర్ణంలో పార్కు ఈ పార్కులను జనవరి 1 నాటికి ప్రారంభించనున్నట్లు సీఎంసీ కమిషనర్ సృజన తెలిపారు. పార్కుల్లో సకల సౌకర్యాలు ఎత్తైన చెట్ల మధ్య ప్రత్యేక గదులు, కుర్చీలు ఫ్రీ హై-స్పీడ్ వైఫై కో-వర్కింగ్ సీటింగ్, కెఫెటేరియా స్టార్టప్ థీమ్ మీటింగ్ హాల్స్, యాంపి థియేటర్ వాకింగ్ ట్రాక్, టాయిలెట్స్ ఎలక్ట్రిక్ వాహనాల ఛార్జింగ్ సదుపాయం సీసీ కెమెరాలతో పూర్తి సెక్యూరిటీ ఈ పార్కులు ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు అందుబాటులో ఉంటాయి. కేవలం నామమాత్రపు ఛార్జీలతో వచ్చే ఏడాది ప్రారంభం నుంచి ఈ పార్కులు ప్రజలకు అందుబాటులోకి రానున్నాయి. తొలి విడతలో వచ్చే రెస్పాన్స్ ను బట్టి మిగిలిన 28 పార్కులను కూడా ఇదే తరహాలో తీర్చిదిద్దనున్నట్లు కమిషనర్ తెలిపారు.

మొదటి పేజీ తరువాయి ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

ఆర్డీఓ కార్యాలయాల్లో... సిరిసిల్ల ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి 05 దరఖాస్తులు, అలాగే వేములవాడ ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి 02 దరఖాస్తులు వచ్చాయి. ఆయా శాఖల అధికారులకు అందజేసి పరిష్కరించాలని ఆదేశించారు. మండల కార్యాలయాల్లో... ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా జిల్లాలోని అన్ని మండలాల్లోని ఎంపీడీఓ కార్యాలయాల్లో సోమవారం ప్రజావాణి కార్యక్రమం ఎంపీడీఓల ఆధ్వర్యంలో నిర్వహించి, ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. మండలాల వారీగా దరఖాస్తుల వివరాలు..బోయినపల్లి ఎంపీడీఓ కార్యాలయానికి 02, చందుర్తి మండలం 0, ఇల్లంతకుంట మండలం 05, గంభీరావుపేట మండలం 05, కోనరావుపేట మండలం 0, ముస్తాబాద్ మండలం 06, రుద్రంగి మండలం 01, తంగళ్లపల్లి మండలం 03, వీర్నపల్లి మండలం 02, వేములవాడ అర్బన్ మండలం 0, వేములవాడ రూరల్ మండలం 02, ఎల్లారెడ్డిపేట ఎంపీడీఓ కార్యాలయానికి 01 చొప్పున వచ్చాయి.

మొదటి పేజీ తరువాయి ధాన్యం నిల్వల కోసం ఆధునిక సైలోలు

తొలి దశలో 20 ప్రాంతాల్లో వీటిని నిర్మించేందుకు కసరత్తు చేస్తోంది. ధాన్యం నిల్వలో నష్టాలను తగ్గించడంతో పాటు రైతులకు మెరుగైన ధరలు అందించడమే ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశమని తెలిపారు.మంత్రి సైలోల ఏర్పాటుపై చర్చించారు. ధాన్యం తేమను పరీక్షించడం, శుభ్రపరచడం, ఆరబెట్టడం, శాస్త్రీయ పద్ధతుల్లో నిల్వ చేయడం వంటి అన్ని సదుపాయాలను ఒకే ప్రాంగణంలో అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకు అవసరమైన స్థలాలు, నిధులు, నిర్మాణ వ్యయం, నిర్వహణ విధానాలపై అధికారులు ప్రాథమికంగా అంచనాలు రూపొందించాలని సూచించారు. సైలోల నిర్మాణం, నిర్వహణ వ్యయాలతో పాటు నిధుల సమీకరణ, అద్దె చెల్లింపుల విధానాన్ని కూడా పరిశీలించాలని ఆదేశించారు.పంట కోసిన వెంటనే వరి ధాన్యంలో సుమారు 25 శాతం తేమ ఉంటుందని మంత్రి వివరించారు. ధాన్యాన్ని ఆరబెట్టేందుకు, భద్రంగా నిల్వ చేసేందుకు సరైన సదుపాయాలు లేకపోవడంతో రైతులు అప్పటి మార్కెట్ ధరలకే విక్రయించాల్సి వస్తోందని పేర్కొన్నారు. దీంతో ధరలు తక్కువగా ఉన్న సమయంలోనూ ధాన్యాన్ని అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోందన్నారు. ఆధునిక సైలో కేంద్రాల్లో శాస్త్రీయ పద్ధతుల్లో ధాన్యాన్ని ఆరబెట్టి, తేమ శాతాన్ని సుమారు 12 శాతానికి తగ్గించి నిల్వ చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.ఈ విధంగా నిల్వ చేసుకుంటే మార్కెట్లో ధరలు అనుకూలంగా ఉన్నప్పుడు రైతులు తమ ఉత్పత్తులను విక్రయించుకోవచ్చని చెప్పారు. తేమను తగ్గించి నాణ్యతను కాపాడిన ధాన్యానికి క్వింటాకు రూ.5,000 నుంచి రూ.5,500 వరకు ధర లభించే అవకాశం ఉందని మంత్రి పేర్కొన్నారు. ముఖ్యంగా జేఎస్ఆర్, ఆర్ఎన్ఆర్, హెచ్ఎంటీ వంటి వరి రకాలకు దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లలో ఆదరణ పెరుగుతోందని వివరించారు.తొలి విడతలో 20 ప్రాంతాల్లో సైలోలు ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనను కార్యరూపంలోకి తీసుకురావడానికి ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఇందుకోసం అనువైన ప్రాంతాలను గుర్తించాలని, ఆర్థిక, సాంకేతిక నిపుణులతో సంప్రదింపులు జరిపి సమగ్ర ప్రతిపాదనలు రూపొందించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. నిర్మాణానికి అవసరమైన పెట్టుబడులు, నిర్వహణ బాధ్యతలు, రైతులకు అందించే సేవల ఖర్చు వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించాలని సూచించారు.సైలోల వ్యవస్థ అందుబాటులోకి వస్తే ధాన్యం కొనుగోళ్ల సమయంలో రైతులపై ఉండే తక్షణ విక్రయ ఒత్తిడి తగ్గే అవకాశం ఉంటుంది. పంటను భద్రపరుచుకునే సదుపాయంతో పాటు మార్కెట్ ధరలను బట్టి విక్రయించుకునే వెసులుబాటు లభించనుంది. అయితే ఈ ప్రణాళిక అమలుకు సంబంధించి స్థలాల ఎంపిక, పెట్టుబడులు, నిర్వహణ విధానాలపై ప్రభుత్వం తీసుకునే తుది నిర్ణయాలు కీలకం కానున్నాయి.

క్యాన్సర్ రోగులకు శుభవార్త 137 ఔషధాల ధరలు భారీగా తగ్గింపు

(న్యూఢిల్లీ, సాక్షర): దేశంలోని క్యాన్సన్ పేషంట్లకు భారీ ఊరట కలిగింది. క్యాన్సర్ మందుల ట్రేడ్ మార్జిన్లపై 30 శాతం పరిమితి విధిస్తూ జాతీయ ఔషధ ధరల నియంత్రణ సంస్థ (NPPA) కీలక నిర్ణయం తీసుకుంది. కొత్త ధరలు నేటి నుంచే అమల్లోకి వచ్చాయి. 137 రకాల క్యాన్సర్ ఔషధాల గరిష్ఠ విక్రయ ధరల్లో 96.45 శాతం వరకు కోత విధించారు. రొమ్ము క్యాన్సర్ మందు 'పాల్‌బోప్రో' ధర రూ.40,421 నుంచి రూ.2,720కి తగ్గగా.. ప్రొస్టేట్ క్యాన్సర్ మందు 'అబిరోన్' ధర రూ.41,250 నుంచి రూ.3,218కి పడిపోయింది. ◆ కొత్త ధరల జాబితాలను ఆసుపత్రులు, రిటైలర్లు, డీలర్లు తమ బోర్డులు, వెబ్‌సైట్లలో ప్రదర్శించాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది.

మొదటి పేజీ తరువాయి హైదరాబాద్ లో దాహం కేకలు....

దీంతో అక్కడ ఉన్న వేలాది అపార్ట్ మెంట్లు, పీజీలు, హాస్టళ్లు, వాణిజ్య సముదాయాలు పూర్తిగా ప్రైవేట్ వాటర్ ట్యాంకర్లపైనే ఆధారపడే పరిస్థితి దాపురించింది. కోటి జనాభా దాటిన హైదరాబాద్ మహానగరంలో తాగునీటి సరఫరా సవాలుగా మారింది. వాతావరణ మార్పులు, వర్షాభావ పరిస్థితుల కారణంగా భూగర్భ జలాలు అగాధానికి పడిపోవడంతో నగరవాసులు ఇప్పటికే నీటి చుక్క కోసం తీవ్ర అల్లాడిపోతున్నారు. ప్రభుత్వ జలమండలి పైపులైన్ల ద్వారా నగరంలోని అన్ని ప్రాంతాలకు నిరంతరాయంగా నీటిని అందించడంలో తీవ్ర నిస్సహాయత ఎదుర్కొంటోంది. ఇలాంటి తరుణంలో వేలాది బహుళ అంతస్తుల అపార్ట్‌మెంట్లు, ఐటీ కారిడార్‌లోని విల్లాలు, కమర్షియల్ కాంప్లెక్స్‌లు, చివరకు శివారు కాలనీల దాహార్తిని తీరుస్తున్నది ప్రైవేటు బోర్ల ఆధారంగా నడిచే నీటి ట్యాంకర్లే. అయితే, ముందస్తు ప్రత్యామ్నాయాలు ఆలోచించకుండా హైడ్రా ఏకపక్షంగా రంగంలోకి దిగి అక్రమ బోర్ల పేరిట విరుచుకుపడటంతో మహానగరం ఒక్కసారిగా నీటి గందరగోళంలోకి జారుకుంది.సున్నం చెరువు, తమ్మిడికుంట, తెల్లాపూర్ వంటి ప్రాంతాలలో సరస్సుల సమీపంలో , ప్రభుత్వ స్థలాలలో వ్యాపార రీత్యా నడుస్తున్న వాటర్ పాయింట్లు, అక్రమ బోర్లపై హైడ్రా దాడులు చేసి, కనెక్షన్లు కట్ చేయడం, మోటార్లు, సంపులను ధ్వంసం చేయడంతో ట్యాంకర్ల వ్యవస్థ దెబ్బతిన్నది. అక్రమంగా భూగర్భ జలాలను తోడేస్తున్నారని, వాటర్ ట్యాంకర్లు ర్యాష్ డ్రైవింగ్ చేస్తున్నాయన్న నెపంతో హైడ్రా తీసుకున్న ఈ ఉన్నపళంగా కఠిన చర్యలు సత్ఫలితాల కంటే నగరవాసులకు నరకాన్ని చూపించాయి. అక్రమ జల దందాను అరికట్టడం మంచిదే అయినప్పటికీ, ప్రజలకు ప్రత్యామ్నాయ సరఫరా మార్గాలను సుగమం చేయకుండా మూలాధారమైన కనెక్షన్లు తెంచివేయడం ప్రైవేటు ట్యాంకర్ల వ్యవస్థను స్తంభింపజేసింది. ఫలితంగా మాదాపూర్, గచ్చిబౌలి, కొండాపూర్, తెల్లాపూర్ వంటి ఐటీ కారిడార్ ప్రాంగణాలతో పాటు చుట్టుపక్కల విస్తరించిన మియాపూర్, కూకట్‌పల్లి, మణికొండ శివారు ప్రాంతాలలో తీవ్రమైన జల సంక్షోభం తలెత్తింది. ఆర్డర్ పెడితే మూడు రోజులైనా ట్యాంకర్ రాని పరిస్థితి ఏర్పడగా, లభ్యత తక్కువ కావడంతో ప్రైవేటు వ్యాపారులు ఒక్కో ట్యాంకర్‌కు రెట్టింపు ధరలు వసూలు చేస్తూ బ్లాక్ మార్కెట్‌కు తెరతీశారు. రోజువారీ అవసరాలకు నీరు దొరక్క అపార్ట్‌మెంట్లలోని ప్రజలు బిందెలు పట్టుకుని రోడ్లెక్కి నిరసన తెలిపే దైన్య స్థితికి చేరుకున్నారు. ట్యాంకర్ల యజమానులు సమ్మె బాట పట్టడంతో గందరగోళం మరింత పెరిగింది. పరిస్థితి చేయిదాటి ప్రజల ఆగ్రహం కట్టలు తెంచుకోవడంతో హైడ్రా కమిషనర్ రంగంలోకి దిగి ట్యాంకర్ల అసోసియేషన్‌తో అత్యవసర చర్చలు జరపాల్సి వచ్చింది. అక్రమ బోర్ల తొలగింపు పేరుతో ప్రజల తాగునీటి సరఫరాకు విఘాతం కలగకుండా, ఔటర్ రింగ్ రోడ్ వెలుపల ఉన్న ప్రాంతాల నుంచి నీటిని తెచ్చుకునేలా తాత్కాలిక సడలింపులు ఇవ్వడంతో ఎట్టకేలకు ట్యాంకర్లు మళ్లీ రోడ్లక్కాయి. అయితే, రెండు రోజుల పాటు సాగిన ఈ హైడ్రా హడావుడి సృష్టించిన గందరగోళం మాత్రం నగరవాసులను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిందనడంలో సందేహం లేదు. సంక్షోభ సమయాల్లో చట్టాలను, నిబంధనలను బుల్డోజర్ల ధోరణితో కఠినంగా అమలు చేయడం కంటే పౌరుల ప్రాథమిక అవసరాలైన నీటి సరఫరాకు మొదటి ప్రాధాన్యత ఇవ్వడం ఏ ప్రభుత్వానికైనా ముఖ్యం. ఏజెన్సీలు అక్రమాలను అరికట్టే సమయంలో క్షేత్రస్థాయి వాస్తవాలను, సాధారణ పౌరుల అవసరాలను పరిగణనలోకి తీసుకోకపోతే.. ప్రజలు ఆ నిబంధనలను పక్కనబెట్టి తమ దాహార్తిని తీర్చడంలో విఫలమైన ప్రభుత్వాన్నే నిందిస్తారు. పర్యావరణ పరిరక్షణ, భూగర్భ జలాల కాపాడుకోవడంతో పాటు ప్రత్యామ్నాయ జల వనరులను పెంచే పక్కా ప్రణాళికతో ముందడుగు వేస్తేనే హైదరాబాద్ లాంటి విశ్వనగరం దాహంతో అల్లాడిపోకుండా నిలబడుతుంది.ఈ తీవ్రమైన అత్యవసర అవసరాన్నే ఆసరాగా చేసుకున్న ప్రైవేట్ వ్యాపారులు, నగర శివారు ప్రాంతాలలో ఎటువంటి అనుమతులు లేకుండా వందల అడుగుల లోతుకు బోర్లు వేసి వ్యాపార ప్రయోజనాల కోసం భూగర్భ జాలలను తోడేస్తున్నారు. ఇటీవల అక్రమ బోర్లను హైడ్రా సీజ్ చేయడం.. వెంటనే వాటర్ ట్యాంకర్ల సమ్మెతో నిమిషాల వ్యవధిలోనే సరఫరా నిలిచిపోయి హైదరాబాద్ లో అల్లకల్లోలమైంది. హైదరాబాద్ నీటి వ్యవస్థ ఎంత దారుణంగా ఉందో ఈ పరిణామం కళ్లకు కట్టింది. అక్రమంగా నీటిని వెలికి తీస్తున్న బోర్లను ఒక్కసారిగా సీజ్ చేస్తే మున్సిపల్ నీటి సదుపాయం లేని శివారు ప్రాంతాలలో తీవ్ర నీటి కొరత ఏర్పడే ప్రమాదం ఉంది. అందుకే ప్రస్తుతం హైడ్రా ఆచితూచి పక్కా ప్లాన్ తో సాగుతోంది. అక్రమ మార్గాలను మూసివేస్తూనే సాధారణ పౌరులకు తాగునీటి కొరత రాకుండా ప్రత్యామ్నాయ సరఫరా మార్గాలను సుగమం చేయడం హైడ్రా ముందున్న అసలైన సవాల్.

మొదటి పేజీ తరువాయి తెలంగాణ జీవనాడి కాళేశ్వరం ప్రాజెక్టు

5దగ్గర నీటి ప్రవాహం ఉన్నప్పుడు నీటిని లిఫ్ట్ చేయవచ్చు. అక్కడ నుండి పంపు హౌస్ కు వెళ్ళడం జరిగింది అక్కడకు వెళ్తే మమ్ములను లోపలికి రాకుండా పొలీస్ లు అడ్డుకున్నారు. అక్కడ లోపలికి పోకుండా అడ్డుకోవడంతో మాకు అనుమానం వచ్చింది ఎందుకుంటే మేడిగడ్డ దగ్గర శబ్దం వచ్చింది అందుకే ఇక్కడ కూడా కన్నెపల్లి దగ్గర లోపలికి రానివ్వలేదని అన్నారు. దేవాదుల ప్రాజెక్టు దగ్గర బరాజ్ లేదు మోటర్లతోనే పంపింగ్ చేస్తున్నారు సీతారామ దగ్గర కూడా బారజ్ లేదు. .పట్టిసీమ దగ్గర కూడా బరాజ్ లేదు..కానీ నీటి పంపింగ్ అవుతుంది . బ్యారేజ్ ఎప్పుడూ అవసరం నీటి లభ్యత తక్కువగా ఉన్నప్పుడు ఎండాకాలంలో అసరం అవుతుంది. తెలంగాణ జీవనాడి కాళేశ్వరం ప్రాజెక్టు అని అనేక సందర్భాల్లో నిరూపితం అయింది. మేము పోయి నిలదీసిన తర్వాత దేవాదుల ప్రాజెక్టు మోటర్లు ఆన్ చేసి ఒక్క రోజు రెండు రోజు నడిపించి ఆఫ్ చేశారు. 80నుండి 120రోజుల పాటు నీటిని లిఫ్ట్. చేసుకునే అవకాశం మనకు ఉన్నది లిఫ్ట్ చేయకుండా ఎన్డీఎస్ఏ సాకు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం కూడా స్పష్టమైన ఆదేశాలు ఇవ్వకుండా తమాషా చేస్తోంది. రాష్ట్రంలో రైతులు సాగుకు,త్రాగుకు నీటి సరఫరా లేక ఇబ్బందులు పడుతుంటే వీళ్ళు ఏం చేస్తున్నారు. దద్దమ్మ కేంద్ర మంత్రులు ఏం చేస్తున్నట్లు . రిటైర్డ్ ఇంజనీర్ లను అవమానకరమైన మాటలు మాట్లాడుతాడు. రానున్న రోజుల్లో హైద్రాబాద్ లో త్రాగు నీటి సమస్య వస్తె ప్రజలే నిన్ను నివు కోరుకున్న ట్రీట్మెంట్ ఇస్తారు. హైద్రాబాద్ ప్రజలు చాలా తెలివైన వారు నీ తమ్ముడు 9తరగతి చదివి ఇప్పుడ స్వచ్ బయో కు చైర్మన్ అవుతాడు అల్లుడికి మెడికవర్ హాస్పిటల్.....ఇంకో తమ్ముడు కు ఇంకో కంపెనీ. నీ మనవడికి ఫుట్ బాల్ ఇస్తామని మెస్సి ఇక్కడకు తెప్పిస్తివి. నీ అన్న తిరుపతి రెడ్డి ఏం పదవి లేకున్న కొడంగల్ లో కలెక్టర్ సైతం సెల్యూట్ చేస్తాడు . కేసీఆర్ పెట్టిన ఎస్టిపి ల ద్వారా గ్రీన్ వాటర్ సప్లై చేస్తున్నారు.అది కేసీఆర్ ఘనతనే. కేసీఆర్ ఆనవాళ్లు చెరిపేస్తాం అంటున్నావ్ నీతో సాధ్యం కాదు. దేశంలో అనేక రాష్ట్రంలో డ్యామ్ లు కొట్టుకుపోయి అక్కడకు ఎన్డీఎస్ఏ పోదు ఎలాంటి రిపోర్ట్ ఇవ్వదు ముందస్తు ప్రణాళికలు లేకుండా ఉంటే నష్టం వస్తుంది అని ముందే ప్లాన్ చేశాం .యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ ను కూడా భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా కేసీఆర్ ఆలోచన చేశారు. నీ భాషను సరిచేసుకోవాలి అని మేము కోరుతున్నాం. జైపాల్ రెడ్డి పేరు మీద జిల్లా ఏర్పాటు చేయాలని పేపర్ లో చూస్తున్నాం. జైపాల్ రెడ్డి పేరు తీస్తే ఆయన ఎంత కోపం ఉండేనో అందరికీ తెలుసు. తిరుపతి రెడ్డి ఏం పదవి ఉన్నది అని కలెక్టర్, ఆర్డీఓ లు రావాలి నిండు సభలో రెవెన్యూ మంత్రి పచ్చి అబద్ధాలను మాట్లాడాడు. టీమ్స్ హాస్పిటల్ నిర్మించడానికి వచ్చినప్పుడు మా ముఖ్యమంత్రి కేసీఆర్ ను నేను రిక్వెస్ట్ చేశాను....ఒక్క రిజర్వాయర్,కావాలి..పార్క్ కావాలి....పోలీస్ స్టేషన్ కావాలి అని అడిగాను. వెంటనే జీవో ఇచ్చారు ....అప్పుడు కానీ ఈ ప్రభుత్వం వచ్చాక జీవో రద్దు చేశారుని అన్నారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడుతూ పది ఏండ్ల ప్రభుత్వం లోపల కేసీఆర్ హయంలో ఏం చేయలేదని అంటున్నాడు రేవంత్ రెడ్డి. నేను మూడు ఏండ్లలో అన్ని చేశాను అంటున్నాడు పది ఎండల్లో తెలంగాణ ఎట్ల ఉండే....ఇప్పుడు మూడు ఎండల్లో తెలంగాణ ఎట్ల ఉన్నది ఒక్కసారి చూస్కో.. మేము అప్పుడు టిడిపి లో ఉన్నాం అనాడు కాలిపోయిన మోటర్లు అసెంబ్లీ ముందు తెచ్చి ధర్నా చేశారు . కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడు ఎంత ఘోరంగా ఇబ్బందులు పడ్డారు. అప్పుడు ఇదే రేవంత్ రెడ్డి ధర్నాలో కూసున్నారు. ఎస్సార్ ఎస్పీ కాలువ పూర్తి అయిన తర్వాత 5;6జిల్లాలోకి నీళ్ళు రావాలి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ, మహారాష్ట్ర లో కాంగ్రెస్ పార్టీ,కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఉన్నది కానీ చుక్క నీళ్లు రాలేదు. అప్పుడు మేము పెద్ద ఎత్తున ఆందోళన చేశాం.ఢిల్లీలో కూడా పెద్ద ఎత్తున ధర్నాలు చేశాం. బాబ్లీ ప్రాజెక్టు కోసం ధర్నాలు చేస్తే రేవంత్ రెడ్డి ఎక్కడ ఉన్నాడు. మేము చివరికి సుప్రీం కోర్టు కు కూడా వెళ్లడం జరిగింది. నాడు కేసీఆర్ హయంలో ఎక్కడ కూడా కరువు మండలాలు లేవు....అప్పుడు వరద నష్టం ఉండే.....ఇప్పుడు కరవు నష్టం అంటున్నారు. దేవాదుల ప్రాజెక్టు వద్ద నీటిని ఎత్తిపోసి నీళ్లు ఇచ్చాం. ఆరోజు రాత్రి మేడిగడ్డ దగ్గర బాంబు పేలింది అని అక్కడ రైతులు అంటున్నారు. ఏదో కుట్ర జరిగినది అని అంటున్నారు.దేవాదుల ప్రాజెక్టు దగ్గర ఇప్పుడు కూడా టు టీఎంసీల నీరు ఉన్నది రాష్ట్రంలో కరువు తెచ్చింది నివు...కరోనా సమయంలో అన్ని రాష్ట్రాలు,దేశాలు చేతులెత్తేశాయి.కానీ కేసీఆర్ అధైర్య పడకుండా ధైర్యం చెప్పారు. ప్రతి ఒకరిని కాపాడుకుంటాను అని కేసీఆర్ చెప్పారు. ఇప్పుడు రేవంత్ రెడ్డి మాత్రం నాకు సంబంధం లేదు అని చేతులు ఎత్తేశాడు. చంద్రబాబు నాయుడు అనేక సందర్భాల్లో అన్నారు కరువు వచ్చిన తెలంగాణకు ఇబ్బంది లేదని అన్నారు. తెలంగాణలో భూముల రెట్లు పెరిగాయి అన్నారు.ఇప్పుడు మాత్రం ఆ పరిస్థితి లేదు మిషన్ భగీరథ పథకం ఇక్కడ అమలు చేసిన తర్వాత ఆ పథకం కేంద్రం అమలు చేసింది దేవాదుల ప్రాజెక్టు ద్వారా నీళ్ళు ఇస్తే పాలకుర్తి నీ ఎందుకు కరువు మండలంగా ప్రకటించావు. కరెంట్ పరిస్థితి ఏంటి....అప్పుడు 24గంటల కరెంట్ ఇచ్చారు. ఇక్కడ కాదు మాట్లాడాల్సింది ఊర్లోకి వెళ్ళి పొలీస్ లు లేకుండా రా పోదాం ప్రజలను అడుగుదాం. పెన్షన్ లు ఎక్కడ పోయాయి..మహిళలకు ఫ్రీ బస్ అన్నావ్ మగవారికి డబుల్ ఛార్జీలు చేశావు. నేను రాజకీయంగా ఎప్పటి నుండో ఉన్నా మా నాన్న రాజకీయ నాయకుడు...నివు ఏంటి ప్రింటింగ్ ప్రెస్ నడిపించే వాడివి గోడల మీద రాసేవాడివి.....అది కూడా రెంట్ కట్టకపోతే ఓనర్ నోటీస్ ఇచ్చాడు. బ్రోకర్ మాటలు నమ్మి ప్రజలు మోసపోయారు..ఇంకా మోసపోరని అన్నారు. మా నాయకులను అనడం ఏంటి.....నేను 7సార్లు గెలిచాను. నివు ఏంటి....గడుపు వస్తె గెలుస్తావు నీ గురించి అంత తెల్సు.. డబ్బు అంత కొడంగల్ లో పెడుతున్నావ్ అక్కడ కూడా నిన్ను చి కొడుతున్నారు నేను రైతు కుటుంబంలో పుట్టాను...వరంగల్ జిల్లా ప్రజలు నన్ను ఆదరిస్తారు . నివు బద్మాష్ వీ....దొంగ సర్టిఫికెట్ లు దొంగ పనులు. మేడిగడ్డ ను రిపేర్ చేసేందుకు మూడు నెలల్లో చేసి చూపెడుతాం అన్నారు హరీష్ రావు ఎందుకు అప్పజెప్పడం లేదు ఇప్పటికైన రాష్ట్రం బాగు చెయ్యి.. రియల్ ఎస్టేట్ మొత్తం పడిపోయింది.నీళ్ళు ఇవ్వు అన్ని మండలాలను ప్రకటించి ఆర్థిక సాయం చెయ్యి. విత్తనాలు కొంటే డిక్లరేషన్ ఇవ్వాలని అంట...మాకు ఏం సంబంధం లేదని ఇదెక్కడి పరిస్థితి. గడ్డం గురించి మాట్లాడతారా.....ఎవరికి నష్టం వచ్చినప్పుడు వాళ్ళు పెంచుతారు తీసేస్తారు ..నేను కూడా ముప్పై ఏండ్లు పెంచాను మొన్న ఆరు ఏండ్లు తీసేసాను...ఇప్పుడు మళ్ళీ పెంచుతున్నానని అన్నారు.

మైలార్‌దేవ్‌పల్లిలో వరుసఅగ్నిప్రమాదాలు.

(రంగారెడ్డి, సాక్షర): దీపావళి పండుగ వేళ రంగారెడ్డి జిల్లా మైలార్‌దేవ్‌పల్లి ప్రాంతంలో వరుస అగ్నిప్రమాదాలు కలకలం రేపాయి. కాటేదాన్ పారిశ్రామికవాడలోని హెచ్‌కే ప్లాస్టిక్ కంపెనీలో భారీ అగ్నిప్రమాదం జరగగా, మరోవైపు దాసరి బస్తీ సమీపంలోని డెకరేషన్ గోదాంలోనూమంటలు ఎగిసిపడ్డాయి. దీంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. వివరాల్లోకి వెళితే. ఒకేరోజు రెండు అగ్నిప్రమాదాలు జరగడంతో పండుగ వేళ ఆ ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఇళ్ల మధ్యలో ఉన్న డెకరేషన్ గోదాంలో మంటలు వ్యాపించడంతో చుట్టుపక్కల నివాసితులు ప్రాణభయంతో పరుగులు తీశారు. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలాలకు చేరుకుని మంటలను అదుపు చేసేందుకు చర్యలు చేపట్టారు. ప్రాంతంలో ఫైర్ స్టేషన్ లేకపోవడం, నివాస ప్రాంతాల మధ్య ఇలాంటి గోదాంల నిర్వహణపై సరైన పర్యవేక్షణ లేకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగించే అక్రమ వ్యాపారాలపై అధికారులు తక్షణమే తనిఖీలు చేపట్టి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

మొదటి పేజీ తరువాయి ఉమ్మడి అదిలాబాద్ లో నీటి గండం

అయితే నదిలో నీటి నిల్వలు తగ్గిపోతుండటంతో భవిష్యత్తులో సరఫరాకు ఆటంకాలు ఏర్పడే ప్రమాదం కనిపిస్తోంది. ముందస్తు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోతే వేసవిలో పరిస్థితి మరింత తీవ్రంగా మారుతుందని గ్రామస్థులు ఇప్పటికే అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. మరోవైపు గోదావరి పరీవాహక ప్రాంతాల్లో రెండో పంట సాగు కోసం నది నుంచి పెద్ద ఎత్తున నీటిని తోడుతుండటం ఆందోళనను పెంచుతోంది.బాసర రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ (ఆర్జీయూకేటీ)కే రోజుకు సుమారు లక్ష లీటర్ల నీరు అవసరమవుతోంది. అమ్మవారి ఆలయానికి మరో 50 వేల లీటర్లు కావాలి. వీటితోపాటు చుట్టుపక్కల గ్రామాలకు కూడా పెద్ద మొత్తంలో నీటిని సరఫరా చేయాల్సి ఉంది. ప్రస్తుతం గోదావరిలో అందుబాటులో ఉన్న నీటితో మరో మూడు నెలలపాటు అవసరాలు తీర్చవచ్చని అంచనా. ఆ తర్వాత పరిస్థితి ఎలా ఉంటుందన్నది ప్రశ్నార్థకంగా మారింది. ప్రత్యామ్నాయ వనరులు, నిల్వ సదుపాయాలు సిద్ధం చేయకపోతే తాగునీటి సరఫరా తీవ్రంగా ప్రభావితమయ్యే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.ఇప్పటికే గోదావరిపై నిర్మించిన బాబ్లీ ప్రాజెక్టు గేట్లు దించడంతో మహారాష్ట్ర వైపు నుంచి వచ్చే నీటి ప్రవాహం నిలిచిపోయింది. దీంతో ప్రస్తుతం స్థానికంగా అందుబాటులో ఉన్న నీటి నిల్వలపైనే ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. మరోవైపు చెరువుల్లో నీటిమట్టం తగ్గడంతో ఆర్జీయూకేటీ విద్యార్థులకు నీటి కొరత ఏర్పడింది. ఈ నేపథ్యంలోనే విద్యార్థులకు సెలవులు ప్రకటించిన విషయం తెలిసిందే. నది, చెరువుల్లో నీటి నిల్వలు తగ్గుతుండటం రానున్న రోజుల్లో ఎదురుకాబోయే సమస్యలకు సంకేతంగా కనిపిస్తోంది.నీటి ఎద్దడి తీవ్రం కాకముందే అధికారులు కార్యాచరణ చేపట్టాల్సిన అవసరం ఉంది. గోదావరిపై ఆధారపడిన గ్రామాలకు నిరంతర సరఫరా అందించేందుకు ప్రత్యామ్నాయ నీటి వనరులను గుర్తించాలి. అందుబాటులో ఉన్న నీటిని నిల్వ చేసుకునేందుకు తగిన సామర్థ్యంతో నిల్వ కేంద్రాలను నిర్మించాలి. ఆర్జీయూకేటీలో విద్యార్థులు వినియోగించిన తర్వాత బయటకు వదిలే నీటిని శుద్ధి చేసి మొక్కలకు, ఇతర అవసరాలకు మళ్లించే అవకాశాలను పరిశీలించాలి. తాగునీటికి ఉపయోగపడే నీటిని ఇతర అవసరాలకు వృథా కాకుండా చూడాలి. గ్రామాల్లోనూ నీటి పొదుపుపై ప్రజలకు అవగాహన కల్పించాలి. అధికారులు, విద్యాసంస్థలు, ఆలయ నిర్వాహకులు, స్థానిక ప్రజలు సమన్వయంతో వ్యవహరిస్తేనే అందుబాటులో ఉన్న నీటిని సమర్థంగా వినియోగించుకోవచ్చు.

మొదటి పేజీ తరువాయి రాజకీయాలకు అతీతంగా.. కరీంనగర్ అభివృద్ధే లక్ష్యం

అనంతరం మీడియా సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఎన్నికల వరకే రాజకీయాలు ఎన్నికల తర్వాత అభివృద్ధే లక్ష్యంగా అందరం కలిసి పనిచేద్దాం . కేంద్ర మంత్రి బండి సంజయ్, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులతో కలిసి కరీంనగర్ ఉమ్మడి జిల్లా అభివృద్ధికి కృషి చేస్తాం. వ్యక్తిగత రాజకీయాలకు అతీతంగా జిల్లా అభివృద్ధి కోసం సమష్టిగా పనిచేయాలని నిర్ణయం తీసుకున్నాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో కరీంనగర్ ఉమ్మడి జిల్లాను అభివృద్ధిలో అగ్రభాగాన నిలబెడతాం. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 70 నుంచి 90 శాతం పూర్తయి పెండింగ్లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తామని అన్నారు. విద్యారంగ అభివృద్ధిలో భాగంగా భీమదేవరపల్లిలో నవోదయ విద్యాలయం ఏర్పాటుకు ప్రతిపాదన చేశాం. రాజన్న సిరిసిల్ల జిల్లాలోనూ నవోదయ విద్యాలయం ఏర్పాటుకు ప్రతిపాదనలు చేశాం. జమ్మికుంట , హుస్నాబాద్లో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేయాలని అడుగుతున్నాం. ఎల్ఎల్బీ, ఎల్ఎల్ఎం, ఫార్మసీ, ఇంజనీరింగ్ వంటి ఉన్నత విద్యా కోర్సులకు ప్రాధాన్యత కల్పిస్తున్నాం. అసంపూర్తిగా నిలిచిపోయిన మెడికల్ కాలేజీ నిర్మాణాన్ని పూర్తి చేయడంతో పాటు వైద్య రంగాన్ని అభివృద్ధి చేస్తాం. విద్య, వైద్యం, పారిశ్రామిక పార్కులు, మౌలిక సదుపాయాల కల్పనకు సమగ్ర ప్రణాళిక తో ముందుకు పోతున్నాం. సింగరేణి, ఎన్టీపీసీ, గోదావరి జలసంపదతో ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు అభివృద్ధిలో అపార అవకాశాలు ఉన్నాయి. వేములవాడ, కొండగట్టు, ధర్మపురి, కాళేశ్వరం, కొత్తకొండ ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నాం. ఎలగందుల ఖిల్లా, ఇతర పర్యాటక ప్రాంతాలు, జలవనరుల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నాం. కరీంనగర్ నగరంలో పెరుగుతున్న పట్టణీకరణకు అనుగుణంగా అర్బన్ డెవలప్మెంట్కు ప్రాధాన్యత ఇస్తున్నామని అన్నారు. రాష్ట్రంలో పట్టణాభివృద్ధి కోసం దాదాపు 1000 కొత్త పోస్టులకు ఇటీవల రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. కరీంనగర్లో అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్రూమ్ ఇళ్లను పేదలకు అందించేలా చర్యలు తీసుకోవాలని ఆర్థిక మంత్రి ,జిల్లా ఇంచార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కోరాం. ప్రజలకు సంబంధించిన ఉమ్మడి సమస్యలను మా దృష్టికి తీసుకువస్తే సానుకూలంగా స్పందించి పరిష్కారానికి కృషి చేస్తాం. జిల్లాకు అవసరమైన అభివృద్ధి పనులపై జర్నలిస్టులు కూడా సూచనలు చేస్తూ భాగస్వాములు కావాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వీలైనన్ని నిధులు తీసుకొచ్చి జిల్లా అభివృద్ధికి సమష్టిగా కృషి చేస్తాం. ఉత్తర తెలంగాణలో అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిన జిల్లాగా ఉమ్మడి కరీంనగర్ను తీర్చిదిద్దడమే మా లక్ష్యమని అన్నారు.

మొదటి పేజీ తరువాయి ఇరాన్‌పై మళ్లీ యుద్ధం..అత్యంత అసంభవం:ట్రంప్

ఈ డీల్‌కు ఇరాన్ అంగీకరించకపోతే తాము మరోసారి సైనిక దాడులు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. పశ్చిమాసియాలో అమెరికా 3 విమాన వాహక యుద్ధనౌకలను మోహరించిందని, అవి పూర్తిస్థాయిలో పోరాటానికి సిద్ధంగా ఉన్నాయని ట్రంప్ తెలిపారు. ఇరాన్‌లోని విద్యుత్ కేంద్రాలు, వంతెనలు సహా కీలక మౌలిక సదుపాయాలను లక్ష్యంగా గుర్తించినట్లు వెల్లడించారు. అయితే.. వాటిని ధ్వంసం చేస్తే పునర్నిర్మాణానికి పదేళ్ల సమయం పట్టొచ్చని, అందుకే అలాంటి చర్యలు తీసుకోవడం తనకిష్టం లేదని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. ఇరాన్‌తో ఉద్రిక్తతలను తగ్గించేందుకు పశ్చిమాసియా దేశాలు దౌత్య ప్రయత్నాలను వేగవంతం చేశాయి. ఖతార్ రాజుతో ట్రంప్ చర్చలు జరిపారు. మరోవైపు.. ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ.. సౌదీ అరేబియా, యూఏఈ, ఒమన్, పాకిస్థాన్, టర్కీ సహా పలు దేశాల ప్రతినిధులతో భేటీ అయ్యారు. అయితే.. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో మాత్రం చర్చల్లో తక్షణ పురోగతి కనిపిస్తోందని చెప్పలేమని స్పష్టం చేశారు. ఇరాన్ ప్రతిపాదనలు ఆమోదయోగ్యంగా లేవని ఆయన వ్యాఖ్యానించారు.

మొదటి పేజీ తరువాయి హార్వెస్టర్ లీజు పేరుతో కిడ్నాప్ డ్రామా

సీసీటీవీ ఫుటేజీ, సాంకేతిక ఆధారాలతో నిందితులను గుర్తించిన దోమకొండ పోలీసులు నలుగురిని అరెస్ట్ చేశారు. వారి నుంచి కారు, నాలుగు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు వివరాలను జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర వెల్లడించారు.

మొదటి పేజీ తరువాయి దీపావళి శుభాకాంక్షల్లో వివాదం..

మతపరమైన బుజ్జగింపు రాజకీయాల కోసం కాంగ్రెస్ ఇలాంటి వ్యాఖ్యలు చేస్తోందని విమర్శించారు. గతంలో ఖర్గే మహాకుంభమేళాపై చేసిన వ్యాఖ్యలను, రాహుల్ గాంధీ ఛఠ్ పూజ సందర్భంగా ప్రధాని మోదీపై చేసిన విమర్శలను కూడా ప్రస్తావించారు. మరో బీజేపీ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారీ.. ఖర్గే వ్యాఖ్యలను బుజ్జగింపు రాజకీయాలకు నిదర్శనంగా అభివర్ణించారు. ఈద్‌ను హిందూ పండగతో పోల్చి కాంగ్రెస్ నేతలు మాట్లాడగలరా? అని ప్రశ్నించారు. మరోవైపు బీజేపీ నేత గౌరవ్ భాటియా కూడా దీపావళికి ప్రత్యేకమైన సంప్రదాయాలు, గుర్తింపు ఉన్నాయని.. ఆ పండగను అదే పేరుతో గౌరవించాలని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ మాత్రం ఖర్గే వ్యాఖ్యలను సమర్థించింది. 'ఈద్' అనే పదాన్ని మతపరమైన అర్థంలో కాకుండా సంతోషాల వేడుకగా విస్తృత భావంలో ఉపయోగించారని వివరించింది. వివిధ మతాలు, సంస్కృతుల మధ్య ఐక్యతను చాటడమే ఆయన ఉద్దేశమని తెలిపింది. మరోవైపు ఎంఐఎం అధికార ప్రతినిధి వారిస్ పఠాన్ కూడా ఖర్గే వ్యాఖ్యలను తప్పుబట్టారు. రెండు పండగలను రాజకీయ ప్రయోజనాల కోసం పోల్చడం సరికాదని వ్యాఖ్యానించారు. దీంతో దీపావళి శుభాకాంక్షల సందర్భంగా మొదలైన వివాదం కాంగ్రెస్, బీజేపీ మధ్య రాజకీయ విమర్శలకు వేదికగా మారింది.

రాష్ట్ర స్థాయి అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

(ఆదిలాబాద్‌టౌన్, సాక్షర): అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం-2026 (డిసెంబర్ 3) సందర్భంగా దివ్యాంగుల సాధికారత రాష్ట్ర స్థాయి అవార్డుల కోసం నామినేషన్లు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి తెలిపారు. ప్రతి సంవత్సరం డిసెంబర్ 3వ తేదీన నిర్వహించబడే 'అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం' సందర్భంగా, దివ్యాంగుల సాధికారత కోసం విశేష కృషి చేసిన వ్యక్తిగత ప్రతిభావంతులు, సంస్థల నుండి రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర స్థాయి అవార్డుల కోసం దరఖాస్తులను కోరుతున్నది. ఈ నేపథ్యంలో, దివ్యాంగుల సంక్షేమం ,సాధికారత కోసం అంకితభావంతో పనిచేస్తున్న అర్హులైన వ్యక్తులు ,సంస్థలు ఈ అవార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాల్సిందిగా కోరారు. చ అర్హులైన వారు తమ నామినేషన్లు, దరఖాస్తులను ఈనెల 16 లోపు సంబంధిత కార్యాలయానికి లేదా ఆన్‌లైన్ ద్వారా సమర్పించాలని తెలిపారు. పూర్తి వివరాల కోసం అధికారిక వెబ్‌సైట్ https://depwdsctgp.telangana.gov.in నుండి తెలుసుకోవచ్చని తెలిపారు.

కడెం ఆయకట్టు ద్వారా సాగునీటి విడుదలతో రైతులకు ఊరట : పులిశెట్టి శ్రీనివాస్



(జన్నారం, సాక్షర): కడెం ఆయకట్టు ద్వారా సాగునీటిని విడుదల చేయడంతో రైతులకు మంచి ఊరట లభించిందని ఆదిలాబాద్ పార్లమెంట్ అడ్హక్ కమిటీ సభ్యులు పులిశెట్టి శ్రీనివాస్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ సాగునీరు సకాలంలో అందకపోవడంతో మండలంలోని రైతులు తీవ్ర ఇబ్బందుల్లో పడ్డారని, అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు సమర్పించి కొన్ని రోజుల నుండి రైతు సమస్యలను అందరి దృష్టికి తీసుకెళ్లడంతో అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నీటిని విడుదల చేయడంతో ఎట్టకేలకు రైతు తమ పంటలను రక్షించుకున్నాడని అన్నారు.దేశానికి వెన్నెముక అన్నదాత అని, రైతే లేనిదే రాజ్యం లేదు అనే నినాదాలు ప్రచారానికి పరిమితం కాకుండా పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరు రైతుకు అండగా నిలవాలని ఆయన కోరారు.

పూసుకుపల్లిలో మోటార్ లేకుండానే బోరు

(ములుగు, సాక్షర): కాళేశ్వరం సమీపంలోని పూసుకుపల్లి గ్రామ శివారులో ఆసక్తికర దృశ్యం కనిపించింది. కాళేశ్వరం సమీపంలోని పూసుకుపల్లిలో మోటార్ లేకుండానే బోరు నుంచి నీరు ఉబికి వస్తోంది. ఎలాంటి మోటార్ ఏర్పాటు చేయకుండానే ఓ బోరు నుంచి నీరు ఉబికి బయటకు వస్తోంది. మేడిగడ్డ పరిసరాల్లో నీటి లభ్యత సమృద్ధిగా ఉందనడానికి ఇదే నిదర్శనమని స్థానికులు చెబుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఎల్‌నినో ప్రభావం ఉన్నప్పటికీ ఈ ప్రాంతంలో నీరు అందుబాటులో ఉందని పేర్కొంటున్నారు. మరోవైపు, భూగర్భ జలమట్టం పెరగడం వల్లే ఈ ఒత్తిడి ఏర్పడిందా అనే చర్చ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వైరల్ అవుతోంది

లక్ష్మణ్ చందాలో వైభవంగా భీమన్న జాతర



(లక్ష్మణ్ చందా, సాక్షర): మండల కేంద్రంలోని శ్రీ భీమన్న జాతర, భీమన్న కళ్యాణము మరియు అగ్ని గుండ ప్రవేశం సోమవారం అత్యంత వైభవంగా జరిగింది.భక్తుల కోలాహలం, తప్పెట్ల వాయిద్యంతో భీమన్న కళ్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. అనంతరం భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో అగ్ని గుండ ప్రవేశం చేశారు. బండారు బాసంతం తర్వాత భీమన్న స్వామిని దర్శించుకునేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ కవిత రాజు, ముదిరాజ్ సంఘ కులస్తులు, పెద్ద మనుషులు, నచ్చన రవి, మస్కాపురం రవి తదితరులు పాల్గొన్నారు.లక్ష్మణ్ చందా ఎస్సై శ్రావణి ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. జాతర విజయవంతం కావడానికి గ్రామస్తులు, యువకులు కృషి చేశారు.

ఇందిరమ్మ ఇంట్లో దీపావళి వేడుకలు



తానూర్ మండలంలోని హంగీర్గా గ్రామంలో బొలిపెల్లి లలిత సాయి ప్రసాద్ కుటుంబం నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల గ్రహ ప్రవేశ వేడుకల్లో ముధోల్ మాజీ ఎమ్మెల్యే జి విట్టల్ రెడ్డి పాల్గొన్నారు ఈ సందర్భంగా నూతన గ్రహంలోకి అడుగుపెట్టి కుటుంబ సభ్యులకు శుభకాంక్షలు తెలియజేశారు. అలాగే ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులందరికీ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే జి విట్టల్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి పెద్ద కుటుంబానికి సొంత ఇల్లు ఉండాలని కలను సహకారం చేసే దిశగా ఇందిరమ్మ ఇల్లు పథకం ఎంతో ఉపయోగకరంగా ఉందని పేర్కొన్నారు. నూతన గ్రహ లో కుటుంబ సభ్యులు సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ భూమాబాయి లక్ష్మణ్ మొగిలి సర్పంచ్ ఉష దర్శన్ మాజీ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ సాగర్ భాయ్ రాజన్న మాజీ వైస్ చైర్మన్ ఎం డి ఫారూఖ్ మాజీ జడ్పిటిసి ఉత్తమ్ బాలేరావ్ మాజీ ఆత్మ చైర్మన్ పోతారెడ్డి తులసిరాం మాజీ సర్పంచ్ పోశెట్టి సుధాకర్ పటేల్ ధర్మేందర్ లక్ష్మణ్ సాయిప్రసాద్ గ్రామస్తులు మహిళలు యువకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులు త్వరితగతిన పరిష్కరించాలి



(ఉట్నూర్, సాక్షర): ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అందుతున్న దరఖాస్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, సమన్వయంతో త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) ఉట్నూర్ ప్రాజెక్టు అధికారి మంద మకరందు అధికారులను ఆదేశించారు.సోమవారం ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ మండలాల నుంచి వచ్చిన ప్రజల వినతులను ఆయన స్వీకరించి, సంబంధిత శాఖల అధికారులకు పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.ఆసిఫాబాద్ మండలం గోపాల్ గూడ గ్రామానికి చెందిన భీంబాయి తమ గ్రామానికి దేవుడు మందిరం మంజూరు కల్పించామని ఆసిఫాబాద్ మండలం ఇప్పలనగాం గ్రామానికి చెందిన శృతి తనకి ఇందిరమ్మ ఇళ్లు ఇప్పించమని ఉట్నూర్ మండలం టక్కుగూడ గ్రామానికి చెందిన తాను బాయి తనకి ఏదైనా ఉద్యోగం మంజూరు కల్పించామని ఇంద్రవెల్లి మండలం మామిడి గూడ గ్రామానికి చెందిన జ్ఞానేశ్వర్ తనకి మెడికల్ ల్యాబ్ టెక్నీయాన్ ఉద్యోగం మంజూరు కొరకు దరఖాస్తు అందజేసారు,అదేవిధంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, స్వయం ఉపాధి పథకాల లబ్ధి, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యల పరిష్కారం తదితర అంశాలపై తమ వినతిపత్రాలను సమర్పించారు.ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖ అధికారులు బాధ్యతాయుతంగా పరిశీలించి, నిబంధనల మేరకు త్వరితగతిన పరిష్కరించాలని ప్రాజెక్టు అధికారి మంద మకరందు ఆదేశించారు. కార్యక్రమంలో ఐటీడీఏకు చెందిన వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక దండారి ఉత్సవాలు : ఎమ్మెల్యే అనిల్ జాదవ్



- ఘనంగా రోల్ మామడ గ్రామంలో దండారి ఉత్సవాలు ఆదివాసీలతో కలిసి సందడి చేసిన ఎమ్మెల్యే

(నేరడిగొండ, సాక్షర): ఆదిలాబాద్ జిల్లా ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలకు దండారి (గుస్సాడి) ఉత్సవాలు ప్రతీకగా నిలుస్తాయని బోత్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు.మండలం రోల్ మామడ గ్రామంలో నిర్వహించిన సంప్రదాయ దండారి ఉత్సవాల్లో బోత్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యేకు గ్రామస్థులు, ఆదివాసీ పెద్దలు, యువకులు సంప్రదాయ పద్ధతిలో ఘన స్వాగతం పలికారు.అనంతరం గ్రామంలో నిర్వహించిన దండారి వేడుకల్లో ఎమ్మెల్యే ఆదివాసీలతో కలిసి పాల్గొని సంప్రదాయ నృత్యాలను వీక్షించారు. కళాకారుల నృత్యాలు, డప్పుల మోతలు, సంప్రదాయ వేషధారణలు, ఆటపాటలతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఎమ్మెల్యే సైతం ఆదివాసీలతో కలిసి సందడి చేస్తూ ఉత్సవాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ ఆదివాసీల జీవన విధానం, సంస్కృతి, సంప్రదాయాలు మన ప్రాంతానికి ప్రత్యేక గుర్తింపునిస్తాయని, తరతరాలుగా వస్తున్న దండారి ఉత్సవాలను భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఆదివాసీల కళలు, ఆచారాలు, సంప్రదాయాలను కాపాడుకోవడంతో పాటు వాటి ప్రాముఖ్యతను ప్రపంచానికి చాటిచెప్పాలని అన్నారు.దండారి ఉత్సవాలు ఆదివాసీ సమాజ ఐక్యతకు, సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకగా నిలుస్తాయని పేర్కొంటూ, ఈ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్న గ్రామ పెద్దలు, యువత, మహిళలు, కళాకారులను ఎమ్మెల్యే అభినందించారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఆదివాసీ నాయకులు, యువకులు, మహిళలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సమస్యలతో వ్యక్తి మృతి



(లక్ష్మణ్ చందా, సాక్షర): ఆర్థిక సమస్యలతో ఇబ్బంది పడుతూ ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం లక్ష్మణ్ చందా మండలంలో చోటుచేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని పార్ పెల్లి గ్రామానికి చెందిన పుట్టి గంగాధర్ (50) వ్యవసాయం చేస్తున్నాడు. గత కొంతకాలంగా ఆర్థిక సమస్యలతో బాధపడుతూ జీవితంపై విరక్తి చెంది ఆదివారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో తన ఇంటిలో అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే నిర్మల్ లోని తిరుమల నర్సింగ్ హోమ్ కు చికిత్స నిమిత్తం తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం మరణించాడు.మృతునికి భార్య, ఇద్దరు కొడుకులు ఉన్నారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు ఎస్సై శ్రావణి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.మానసిక ఒత్తిడి, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారు తక్షణ సహాయం కోసం టెలి-మానస్ హెల్ప్ లైన్ 14416 కు కాల్ చేయవచ్చు.

పుస్తకాలు అందజేసిన బలరాం జాదవ్

- ఉద్యోగాలు సాధించేందుకు విద్యా వనరులు అందుబాటులో ఉండాలి



నేరడిగొండ, సాక్షర: నేరడిగొండ మండల కేంద్రంలోని గ్రంథాలయానికి పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలను రాష్ట్ర అధ్యాపకుల సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత యువతకు పోటీ పరీక్షలపై అవగాహన పెంపొందించడంతో పాటు, వారు ఉన్నత ఉద్యోగాలు సాధించేందుకు అవసరమైన విద్యా వనరులు అందుబాటులో ఉండాలని ఆకాంక్షించారు. రాబోయే ప్రభుత్వ ఉద్యోగ నోటిఫికేషన్లలో యువత అధిక సంఖ్యలో ఉద్యోగాలు సాధించి తమ లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్షించారు.యువతకు అవసరమైన విద్యా వనరులు అందించడం ద్వారా వారి భవిష్యత్తుకు బాటలు వేయడమే తన లక్ష్యమని బలరాం జాదవ్ తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరేష్, జ్యోతిరామ్, గ్రంథపాలకులు శ్రీకాంత్, స్వామి, జగన్, పలువురు యువకులు పాల్గొన్నారు.

ప్రజలకు ఏ సమస్య వచ్చినా పోలీస్ శాఖ అండగా ఉంటుంది : ఎస్పీ జి. జానకి షర్మిల

- ప్రజావాణిలో ప్రజల సమస్యలను స్వయంగా విన్న ఎస్పీ ఫిర్యాదులపై తక్షణమే స్పందించి బాధితులకు సత్వర న్యాయం అందించాలి



(నిర్మల్ ప్రతినిధి, సాక్షర) ప్రజలకు ఏ సమస్య వచ్చినా పోలీస్ శాఖ అండగా ఉంటుందని, బాధితులకు న్యాయం చేయడమే పోలీసుల ప్రధాన బాధ్యత అని నిర్మల్ జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, ఐపీఎస్ అన్నారు.నిర్మల్ జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల ఫిర్యాదులు, వినతులను ఎస్పీ స్వయంగా స్వీకరించారు. ఫిర్యాదుదారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి, చట్టపరిధిలో పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులకు సూచించారు.ప్రజలు తమ సమస్యలతో పోలీస్ స్టేషన్లకు వచ్చినప్పుడు వారికి భరోసా కల్పించాలని, వారి మాటలను ఓపికగా విని సమస్య తీవ్రతను అర్థం చేసుకోవాలని ఎస్పీ తెలిపారు. ఫిర్యాదుల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించకుండా తక్షణమే స్పందించి, బాధితులకు సకాలంలో న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.పోలీస్ స్టేషన్లకు వచ్చే ప్రతి ఒక్కరితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, ప్రజలకు అవసరమైన సహకారం అందించాలని ఎస్పీ స్పష్టం చేశారు. ప్రజలకు పోలీస్ శాఖపై నమ్మకం, విశ్వాసం పెంపొందించేలా ప్రతి పోలీసు అధికారి బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని తెలిపారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వడమే నిర్మల్ పోలీసుల లక్ష్యమని ఎస్పీ డా. జి. జానకి షర్మిల పేర్కొన్నారు.

సాగునీటి విడుదలకు ఎంపీ చొరవ : మధుసూదన్ రావు

(జన్నారం, సాక్షర): మండలంలోని రైతులకు సాగునీటి విడుదల కొరకు ఆదిలాబాద్ పార్లమెంటు సభ్యులు గోడెం నగేష్ చొరవ చూపడంతో నీరు విడుదల అయ్యిందని బీజేపీ జన్నారం మండలశాఖ అధ్యక్షులు జి. మధుసూదన్ రావు తెలిపారు.సోమవారం ఆయన మాట్లాడుతూ మండలంలో రైతులు పండించిన పంట పొలాలు సకాలంలో నీరు అందక చేతికందవచ్చిన రైతులు నష్టపోయే ప్రమాదం ఉందని, మంచిర్యాల జిల్లా ఎస్టీ మోర్చా అధ్యక్షులు అజ్మీర బద్రినాయక్, మండల కిసాన్ మోర్చా అధ్యక్షులు బెడద గోపాల్ తో కలిసి ఎంపీని కలిసి వివరించగా ఆయన వెంటనే స్పందించి నీటిపారుదల శాఖ అధికారులతో సంప్రదించి రైతులకు ఎటువంటి నష్టం జరగవద్దని, ఎవరి పంటలు ఎండిపోవద్దని సూచించడంతో అధికారులు నీటిని విడుదల చేశారని ఆయన తెలిపారు.సమస్య చెప్పిన వెంటనే స్పందించిన ఎంపీకి మండల పార్టీ, రైతుల పక్షాన ధన్యవాదాలు అని ఆయన తెలిపారు.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

(ఉట్నూర్, సాక్షర): ఉట్నూర్ ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని ఉట్నూర్, ఇంద్రవెల్లి మండలాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ, హెల్పర్ ఆయా పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ మాన ఉమాదేవి తెలిపారు.నిబంధనల ప్రకారం అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.దరఖాస్తుల స్వీకరణ 09-11-2026 నుండి 11-11-2026 వరకు ఉట్నూర్ ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో జరుగుతుందని తెలిపారు. అర్హత సాధించిన అభ్యర్థులు ప్రకటనను పరిశీలించి, అవసరమైన ఆధారాలతో దరఖాస్తులను 11-11-2026 సాయంత్రం 5 గంటల లోపు ఉట్నూర్ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. నిర్ణీత గడువు లోపల వచ్చిన దరఖాస్తులను మాత్రమే స్వీకరిస్తామని స్పష్టం చేశారు.ఈ సమాచారాన్ని దినపత్రికలలో ప్రచురించాలని డీపీఆర్ఓను కోరారు.

ఎల్‌నినో ప్రభావంతో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి

- ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదూ ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ



(నిజామాబాద్ ప్రతినిధి, సాక్షర) ఎల్‌నినో ప్రభావంతో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ అధికారులకు సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, అమృత్ పథకం పనులు వేగవంతం చేయాలని, ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని అన్నారు. నిజామాబాద్ పట్టణంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆర్డీవో, మున్సిపల్ కమిషనర్‌తో పాటు వివిధ శాఖల అధికారులతో తెలంగాణ ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు, తాగునీటి సరఫరా, అమృత్ పథకం కింద నిర్మిస్తున్న వాటర్ ట్యాంకుల పనుల పురోగతితో పాటు పట్టణంలోని పలు ప్రజా సమస్యలపై అధికారులతో ఆయన సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా మహమ్మద్ అలీ షబ్బీర్ మాట్లాడుతూరాబోయే రోజుల్లో ఎల్‌నినో ప్రభావం కారణంగా ఎండల తీవ్రత పెరిగి, తాగునీటి సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున అధికారులు ఇప్పటి నుంచే అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలగకుండా సమగ్ర కార్యాచరణ రూపొందించాలని, అవసరమైన చోట ప్రత్యామ్నాయ నీటి సరఫరా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. పట్టణంలోని అన్ని ప్రాంతాలకు సమానంగా, నిరంతరాయంగా తాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు.అమృత్ పథకం కింద నిర్మిస్తున్న వాటర్ ట్యాంకుల పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని, నిర్మాణ నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని స్పష్టం చేశారు. ఈ పనులు పూర్తయితే పట్టణ ప్రజలకు తాగునీటి సరఫరా మరింత మెరుగుపడుతుందని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం పేద ప్రజల సొంతింటి కలను నెరవేర్చే గొప్ప సంక్షేమ కార్యక్రమమని, అర్హులైన లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పథకం అమలయ్యేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని అన్నారు. ఇళ్ల నిర్మాణ పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, లబ్ధిదారులకు ప్రభుత్వ పరంగా అందాల్సిన సహాయాన్ని సకాలంలో అందించాలని సూచించారు.నిజామాబాద్ పట్టణంలో రోడ్లు, డ్రైనేజీ, పారిశుద్ధ్యం, వీధి దీపాలు, తాగునీటి సరఫరా వంటి మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచకుండా తక్షణమే పరిష్కరించాలని తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో నుడా చైర్మన్ కేశ వేణు, పట్టణ కార్పొరేట ర్ లు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

వైద్య సదుపాయాల మెరుగుదలకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ రెండు నూతన అంబులెన్స్‌లు ప్రారంభం



(మంచిర్యాల, సాక్షర) జిల్లాలో ప్రభుత్వ వైద్య సేవలను మరింత బలోపేతం చేసి, ప్రభుత్వ వైద్య కళాశాల, జనరల్ ఆసుపత్రిని రాష్ట్రంలోనే ఆదర్శ వైద్య కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు.సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి మంజూరు చేసిన 2 నూతన అంబులెన్సులను మంచిర్యాల నియోజకవర్గ శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అన్వేష్, మేయర్ ధర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్లా రమ్య, ప్రభుత్వ ఆసుపత్రి పర్యవేక్షకులు అశోక్, ఆర్.ఎం.ఓ. శ్రీధర్, మార్కెట్ కమిటీ చైర్మన్ బాణేష్ లతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గత ఏడాది కాలంలో డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ (డిఎంఎఫ్) నిధుల నుంచి వైద్య రంగానికి 9 కోట్ల రూపాయలకు పైగా నిధులు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. గతంలో కొనుగోలు చేసిన వైద్య పరికరాలకు మరమ్మతులు చేపట్టి తిరిగి వినియోగంలోకి తీసుకురావడం జరిగిందని తెలిపారు.వెంటిలేటర్ల కొరతను అధిగమించేందుకు 10కి పైగా నూతన వెంటిలేటర్లను కొనుగోలు చేశామని, మాతా శిశు ఆసుపత్రి కోసం 4, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి కోసం 6 చొప్పున మొత్తం 10 వెంటిలేటర్లను అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని తెలిపారు. ఇప్పటికే 4 కోట్ల రూపాయలకు పైగా విలువైన వైద్య పరికరాల కొనుగోలు పూర్తయిందని, అదనంగా 4.2 కోట్ల రూపాయల నిధులు మంజూరు కాగా, త్వరలోనే మరిన్ని ఆధునిక వైద్య పరికరాలను కొనుగోలు చేస్తామని తెలిపారు.మహిళలకు మెరుగైన శస్త్రచికిత్స సేవలు అందించేందుకు సుమారు 80 లక్షల రూపాయల వ్యయంతో 2 ల్యాపరోస్కోపీ యానిట్లను కొనుగోలు చేస్తున్నామని, వీటి ద్వారా తక్కువ రక్తస్రావంతో శస్త్రచికిత్సలు నిర్వహించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. హెచ్ఐవి, హెపటైటిస్-బి వంటి హైరిస్క్ రోగులకు మెరుగైన చికిత్స అందించేందుకు మాతా శిశు ఆసుపత్రిలో ప్రత్యేక ఆపరేషన్ థియేటర్ ఏర్పాటు చేయాలని నిర్ణయించామని, ఇందుకు సంబంధించిన నిధులు ఇప్పటికే మంజూరయ్యాయని తెలిపారు.ప్రజలకు అవసరమైన వైద్య పరికరాలు, శస్త్రచికిత్స సదుపాయాలను ప్రభుత్వ ఆసుపత్రిలోనే అందుబాటులోకి తీసుకురావడం జరుగుతుందని, ఇతర ప్రాంతాలకు రిఫర్ చేయవలసిన పరిస్థితులు తగ్గించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వ వైద్య కళాశాల ఆసుపత్రిలో రోజుకు సుమారు 1,700 నుంచి 2 వేల మంది వరకు అవుట్ పేషెంట్లు వైద్య సేవలు పొందుతున్నారని తెలిపారు. మంచిర్యాల జిల్లాతో పాటు పొరుగు జిల్లాలు, ఇతర రాష్ట్రాల నుంచి కూడా రోగులు వస్తున్నారని, ఎలాంటి వివక్ష లేకుండా అందరికీ నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు.క్రిటికల్ కేర్ బ్లాక్ పూర్తయిన అనంతరం ఆసుపత్రిలో మొత్తం పడకల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని తెలిపారు. కొత్త ప్రభుత్వ ఆసుపత్రి భవనంలో ఆధునిక మౌలిక సదుపాయాలతో పాటు సాధారణ ఆక్సిజన్ సిలిండర్లపై ఆధారపడకుండా లిక్విడ్ ఆక్సిజన్ ట్యాంక్ ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. ట్రామా కేర్, క్రిటికల్ కేర్, ఐసియూ, మాతా శిశు వైద్య సేవలు, సాధారణ శస్త్రచికిత్సలు, డయాలసిస్, బ్లడ్ బ్యాంక్ తదితర అన్ని రకాల వైద్య సదుపాయాలు ఒకే ప్రాంగణంలో అందుబాటులోకి తీసుకురావడం జరుగుతుందని తెలిపారు.ప్రధానంగా రోడ్డు ప్రమాద బాధితులకు తక్షణ వైద్య సహాయం అందించేందుకు పి.ఎం. రాహత్ పథకం అమలులో మంచిర్యాల జిల్లా రాష్ట్రంలో ముందంజలో ఉందని, వైద్యులు, నర్సింగ్ సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం వైద్య రంగానికి అందిస్తున్న సహకారంతో ఇద్దరు న్యూరాలజిస్టులు, ఒక యూరాలజిస్టు నియామకం జరిగిందని, సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.ప్రభుత్వ వైద్య కళాశాలకు 15 పి.జి. సీట్లు మంజూరయ్యాయని, గైనకాలజీ, పిడియాట్రిక్స్, జనరల్ మెడిసిన్ విభాగాలలో వైద్య విద్యార్థులకు పి.జి. విద్యనభ్యసించే అవకాశం కలిగిందని తెలిపారు. వచ్చే ఏడాది సర్జరీ, అనస్థీషియా తదితర విభాగాలలో పి.జి. సీట్లు, భవిష్యత్తులో సూపర్ స్పెషాలిటీ కోర్సులు తీసుకురావడం జరుగుతుందని తెలిపారు. కార్డియాలజిస్టు నియామకంతో పాటు క్యాత్‌ల్యాబ్ ఏర్పాటు దిశగా ప్రయత్నాలు కొనసాగుతున్నాయని తెలిపారు.లక్షెట్టిపేట ఆసుపత్రిలో ప్రస్తుతం రోజుకు కనీసం 300 నుంచి 500 మంది వరకు వైద్య సేవలు పొందుతున్నారని, సీజన్‌లో రోగుల సంఖ్య మరింత పెరుగుతుందని తెలిపారు. వైద్య కళాశాల, ఆసుపత్రి నూతన భవన నిర్మాణ పనులను వేగవంతం చేసి జనవరి 26, 2027వ తేదీ నాటికి అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేసి కొత్త భవనంలో వైద్య సేవలు ప్రారంభించే లక్ష్యంతో పని చేస్తున్నామని తెలిపారు. మంచిర్యాల జిల్లాను వైద్య రంగంలో రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలిపేందుకు సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని తెలిపారు.ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు మాట్లాడుతూ, ప్రజలకు అత్యంత అవసరమైన రంగాలు వైద్యం, విద్య అని, ఈ రంగాలలో ప్రభుత్వ సేవలను బలోపేతం చేయడమే ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్య సిబ్బంది పరిమిత వనరులతోనూ అందిస్తున్న సేవలు అభినందనీయమని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రి నూతన భవన నిర్మాణ పనులు మరో 2, 3 నెలలలో పూర్తయితే ప్రస్తుతం ఉన్న సమస్యలలో దాదాపు 50 శాతం పరిష్కారమవుతాయని తెలిపారు.క్యాత్‌ల్యాబ్ ఏర్పాటు చేసి, కార్డియాలజిస్టును నియమించేలా చర్యలు తీసుకుంటే గుండె సంబంధిత వ్యాధులకు జిల్లాలోనే మెరుగైన వైద్యం అందించవచ్చని తెలిపారు. హైదరాబాద్‌లో లభించే ఆధునిక వైద్య సదుపాయాలను ఇక్కడే అందుబాటులోకి తీసుకువచ్చి, ఆరోగ్యశ్రీ పథకం ద్వారా పేదలకు ఉచితంగా వైద్యం అందించేలా కృషి చేస్తామని తెలిపారు.ప్రైవేట్ అంబులెన్స్ వారు వ్యాపార దృక్పథంతో కాకుండా సేవాభావంతో పని చేయాలని, రోగులను అనవసరంగా ప్రైవేటు ఆసుపత్రులకు తరలిస్తూ, కమీషన్ల కోసం ప్రయత్నించే విధానాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని తెలిపారు. అంబులెన్స్ సేవల నిర్వహణ, వివిధ మండలాల నుంచి ఆసుపత్రులకు రోగులను తరలించే దూరాలు, ఛార్జీలపై రాబోయే 10 రోజులలో సంబంధిత అధికారులతో సమావేశమై స్పష్టమైన నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. రోగుల ప్రాణాలతో చెలగాటమాడే విధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ప్రభుత్వ ఆసుపత్రికి 2 అంబులెన్సులను అందించడం జరిగిందని, అంతర్ జిల్లా రోగుల తరలింపుతో పాటు దూర ప్రాంతాల నుంచి వచ్చే రోగులకు రవాణా సౌకర్యం కల్పించేందుకు ఇవి ఉపయోగపడతాయని తెలిపారు. ఇందుకు సహకరించిన జిల్లా కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రి నూతన భవన ప్రారంభోత్సవాన్ని జనవరి 26వ తేదీన నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని, ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ప్రారంభోత్సవానికి అవసరమైన ఏర్పాట్లు చేపడతామని తెలిపారు. ప్రభుత్వ వైద్య సేవలను మరింత విస్తరించి జిల్లాను వైద్య రంగంలో ఆదర్శంగా నిలిపేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలని వినతి



(కాసిపేట, సాక్షర): కాసిపేట గ్రామపంచాయతీ పరిధిలోని 1వ వార్డులో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ రక్షణ సేన కాసిపేట మండల అధ్యక్షులు సోదారి సురేష్ ఆధ్వర్యంలో ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు.రోడ్ల సమస్యను పరిష్కరించి, అవసరమైన చోట సీసీ రోడ్లు నిర్మించాలని కోరారు. ఇప్పటికే ఉన్న మురుగు కాలువల్లో పూడికలు తొలగించి, మురుగు నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.మిషన్ భగీరథ పైప్‌లైన్ వేయకపోవడంతో ప్రజలకు తాగునీరు అందడం లేదని, వెంటనే పైప్‌లైన్ ఏర్పాటు చేసి ప్రతి ఇంటికి తాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన యువజన నాయకులు గంగాధరి రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బూరుగూడలో బెల్ట్ షాపులను మూసివేయించాలి : గ్రామస్తులు

- ప్రజా ఫిర్యాదులో వినతిపత్రం అందజేత



(ఆసిఫాబాద్, సాక్షర): ఆసిఫాబాద్ మండలం బూరుగూడ గ్రామంలో బెల్ట్ షాపులను మూసివేయించాలని ఆ గ్రామస్తులు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని ప్రజా ఫిర్యాదు కార్యక్రమంలో వినతిపత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో గల్లికి ఒక్క బెల్ట్ షాప్ ఉండటంతో యువత మద్యానికి అలవాటు పడి చెడు అలవాట్లకు పాల్పడుతున్నారని అన్నారు. పాఠశాల పరిసరాలలో షాపులు ఉండటంతో విద్యార్థులు పాఠశాలకు వెళ్లడానికి చాలా ఇబ్బందులు ఎదుర్కుంటున్నారని అన్నారు. వెంటనే సంబంధిత అధికారులు తనిఖీలు చేపట్టి బెల్ట్ షాపులను మూసివేయించాలని డిమాండ్ చేశారు.

కడెంలో బీఆర్ఎస్‌లోకి భారీగా చేరికలు



(నిర్మల్ ప్రతినిధి, సాక్షర): ఖానాపూర్ నియోజకవర్గం కడెం మండలంలో బీఆర్ఎస్ పార్టీలోకి భారీగా చేరికలు జరిగాయి.కడెం మండలం కొండుకూర్‌లోని ఎస్‌కే ఫంక్షన్ హాల్‌లో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీకి చెందిన 300 మంది నాయకులు, కార్యకర్తలతో పాటు కాంగ్రెస్ పార్టీకి చెందిన 40 మంది నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు.ఈ సందర్భంగా ఖానాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్ వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ నెల 11న నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొననున్న రైతు గర్జన సభను విజయవంతం చేయాలని నూతనంగా పార్టీలో చేరిన నాయకులకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఖానాపూర్ నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి నాయకులు, కార్యకర్తలు, రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సభలో పాల్గొనాలని కోరారు.ఈ సందర్భంగా నూతనంగా పార్టీలో చేరిన నాయకులు, కార్యకర్తలు రైతులకు అండగా నిలిచిన కేసీఆర్ నాయకత్వానికి తమ మద్దతు ఉంటుందని ప్రకటించారు. రైతుల సమస్యలను వినిపించేందుకు నిర్వహిస్తున్న రైతు గర్జన సభకు పెద్ద సంఖ్యలో తరలివస్తామని తెలిపారు.కార్యక్రమంలో కడెం మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఈవీఎం, వీవీప్యాట్ గోదాంను తనిఖీ చేసిన కలెక్టర్ భవేష్ మిశ్రా



• యంత్రాల భద్రత, నిల్వ ఏర్పాట్లు, రికార్డుల పరిశీలన

(నిర్మల్ ప్రతినిధి, సాక్షర): ప్రతి నెల నిర్వహించే సాధారణ తనిఖీల్లో భాగంగా సోమవారం కలెక్టరేట్ సమీపంలోని ఈవీఎం, వీవీప్యాట్ యంత్రాల భద్రపరిచే గోదాంను జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా గోదాంలో భద్రపరిచిన ఈవీఎం, వీవీప్యాట్ యంత్రాల భద్రతా ఏర్పాట్లతో పాటు నిల్వ విధానాన్ని పరిశీలించారు. సంబంధిత రికార్డులను తనిఖీ చేసి, నిర్వహణ వివరాలను సమీక్షించారు.ఈ తనిఖీలో అదనపు కలెక్టర్ వెంకట మాధవరావు, ఎన్నికల విభాగం పర్యవేక్షణ అధికారి స్వాతి, తహసీల్దార్ రాజు, సంబంధిత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాధితుల ప్రతి సమస్య పట్ల జవాబుదారీతనంతో ఉండాలి జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

• సమస్యలు పరిష్కారమైనప్పుడే పోలీసు వ్యవస్థపై ప్రజలకు నమ్మకం పెరుగుతుంది



(ఆదిలాబాద్‌టౌన్, సాక్షర): బాధితుల ప్రతి సమస్యను పరిష్కరించే దిశగా కృషి చేస్తూ ప్రతి సమస్య పట్ల జవాబుదారీతనంతో ఉండాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, ఐపీఎస్ సూచించారు. పోలీసు ముఖ్య కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా 18 ఫిర్యాదులను జిల్లా ఎస్పీ నేరుగా స్వీకరించారు. సోమవారం పోలీసు ముఖ్య కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల కార్యక్రమం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా 18 మంది ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా ఎస్పీకి నేరుగా విన్నవించారు.ఫిర్యాదులను స్వీకరించిన జిల్లా ఎస్పీ బాధితుల సమస్యలను స్వయంగా విని, సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశాలు జారీ చేశారు. ప్రతి ఫిర్యాదుపై సమగ్ర విచారణ చేపట్టి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బాధితుల సమస్యలను పరిష్కరించినప్పుడే పోలీసు వ్యవస్థపై ప్రజలకు నమ్మకం, విశ్వాసం మరింత పెరుగుతాయని తెలిపారు.ప్రజలు పోలీసుల ద్వారా పరిష్కరించదగిన సమస్యలపై నిర్భయంగా జిల్లా పోలీసు కార్యాలయాన్ని లేదా నేరుగా జిల్లా ఎస్పీని సంప్రదించాలని సూచించారు. జిల్లాలో ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు సమాచారం ఉంటే జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా నిర్వహిస్తున్న 8712659973 వాట్సాప్ నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని తెలిపారు.అసాంఘిక కార్యకలాపాలు లేని, గంజాయి మరియు మాదకద్రవ్యాల రహిత జిల్లాగా ఆదిలాబాద్‌ను నిర్మించేందుకు యువత, ప్రజలు పోలీసులకు పూర్తి సహాయ సహకారాలు అందించాలని జిల్లా ఎస్పీ కోరారు.ఈ కార్యక్రమంలో సీసీ కొండరాజు, సిబ్బంది వామన్, సునీల్, లిఖిత తదితరులు పాల్గొన్నారు.

తపాలాపూర్ వద్ద రైతుల రాస్తారోకో

• సాగునీరు చివరి పంట వరకు అందేలా చూడాలి భారీగా నిలిచిన వాహనాలు



(జన్నారం, సాక్షర): మండలం తపాలాపూర్ వద్ద ప్రధాన రహదారిపై రైతులు రాస్తారోకో చేశారు. దీంతో పెద్ద సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి.సోమవారం సాగునీటి కొరకై తపాలాపూర్ గ్రామ రైతులు లక్షెట్టిపేట - జన్నారం ప్రధాన రహదారిపై బైఠాయించారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు కమ్మల విజయధర్మ, నైనాల తిరపతి, సుశీల మాట్లాడుతూ కడెం ఆయకట్టు నుండి చివరి పంట వరకు సాగునీరు అందించాలని, పంటలు చివరిదశకు వచ్చిన సమయంలో నీటిని నిలిపివేయడం సరైన పద్ధతి కాదని అన్నారు. ఈ విషయంలో అధికారులను ప్రశ్నిస్తే పొంతనలేని సమాధానాలు చెపుతున్నారని, తొందరగా నీరు అందకుంటే పొలాలు పూర్తిగా పోతాయని, దీంతో రైతులు నష్టపోయే ప్రమాదం ఉందని అన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు కాస్తంత రైతుల కష్టాలపై దృష్టి సారించి సాగునీరు చివరి పంట వరకు అందేలా చూడాలని కోరారు.ఈ నిరసన కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో రైతులు, యువకులు, ప్రజలు తరలి రావడం, ఎమ్మెల్యే ఇక్కడకు రావాలని, సాగునీరు వెంటనే విడుదల చేయాలని, అంతవరకు నిరసన విరమించేది లేదని భీష్మించుకొని ఉండడంతో మంచిర్యాల ఏసీపీ ప్రకాష్ అక్కడకు చేరుకొని రైతులను సముదాయించి ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని, ట్రాఫిక్ నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని వారికి తెలపడంతో రైతులు రాస్తారోకో విరమించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో రైతులు, యువకులు, ప్రజలు పాల్గొన్నారు.

సారంగాపూర్ లో రెండు దొంగతనాల కేసులు ఛేదన



(నిర్మల్ ప్రతినిధి, సాక్షర) జిల్లా సారంగాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన రెండు వేర్వేరు దొంగతనాల కేసులను పోలీసులు విజయవంతంగా ఛేదించారు.ఈ కేసులకు సంబంధించి ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి చోరీకి గురైన ఇత్తడి, వెండి వస్తువులతో పాటు ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.ఈ నెల 6వ తేదీ రాత్రి సారంగాపూర్ పాత బస్టాండ్ ప్రాంతంలో కందూరి రాజమణి ఇంటి తాళం పగలగొట్టి ఇంట్లో ఉన్న ఇత్తడి, వెండి వస్తువులను గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. అదే రాత్రి జాం గ్రామానికి చెందిన మనుకల రాజేశ్వర్‌కు చెందిన ప్యాషన్ ప్రో బైక్‌ను సైతం అపహరించారు.ఈ రెండు ఘటనలపై కేసులు నమోదు చేసిన పోలీసులు జిల్లా ఎస్పీ డా. జానకీ షర్మిల, ఐపీఎస్ ఆదేశాల మేరకు దర్యాప్తు చేపట్టారు. నిర్మల్ రూరల్ సీఐ కృష్ణ నేతృత్వంలో సారంగాపూర్ ఎస్ఐ శ్రీకాంత్ ఆధారాలు సేకరించి దర్యాప్తును వేగవంతం చేశారు. ఈ క్రమంలో ఇద్దరు నిందితులు ఏ1 సుగేందర్ (వైఎస్ఆర్ కాలనీ, నిర్మల్), ఏ2 గబ్బర్ సింగ్ రాథోడ్ (ఆదిలాబాద్) లను సోమవారం అరెస్ట్ చేశారు.స్వాధీనం చేసుకున్న చోరీ సొత్తు వివరాలు :క్రైమ్ నంబర్ 144/2026, బీఎన్ ఎస్ 331(4), 305(ఏ) : సుమారు రూ.20 వేల విలువైన ఇత్తడి వస్తువులు, వెండి మొలతాడు, వెండి కుంకుమ భరిణి స్వాధీనం.క్రైమ్ నంబర్ 145/2026, బీఎన్ఎస్ 305(బీ) : సుమారు రూ.55 వేల విలువైన ప్యాషన్ ప్రో బైక్ స్వాధీనం.మొత్తంగా సుమారు రూ.75 వేల విలువైన చోరీ సొత్తును పోలీసులు రికవరీ చేశారు.ఈ రెండు కేసుల ఛేదనలో ప్రతిభ కనబరిచిన హెడ్ కానిస్టేబుల్ జమీర్, కానిస్టేబుళ్లు మాధవ్, రవిలను నిర్మల్ డీఎస్పీ పి. శ్రీనివాస్, జిల్లా ఎస్పీ డా. జానకీ షర్మిల, ఐపీఎస్ అభినందించారు.



పలువురు వ్యాపారవేత్తల లక్ష్మీ పూజ కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ దండే విఠల్



కాగజ్‌నగర్, సాక్షర: కాగజ్ నగర్ పట్టణంలో పలువురు వ్యాపారవేత్తల ఆహ్వానం మేరకు నిర్వహించిన లక్ష్మీ పూజ కార్యక్రమాల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రత్యేక పూజల్లో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. వ్యాపారవేత్తలు, వారి కుటుంబ సభ్యులకు దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

ప్రజావాణి అర్జీల సత్వర పరిష్కారానికి అధికారుల ప్రత్యేక దృష్టి సారించాలి



• స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎస్.రాజేశ్వర్

(ఆదిలాబాద్, సాక్షర) : ప్రజావాణి లాగిన్లోని దరఖాస్తులన్నింటినీకి నిబంధనల ప్రకారం తగిన సమాధానాలు పంపేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని అదనపు కలెక్టర్ రాజేశ్వర్ స్పష్టం చేశారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి అదనపు కలెక్టర్ ఆర్.ఎస్.చిత్రు తో కలిసి ఆయన అర్జీలను స్వీకరించారు. ఈ ప్రజావాణిలో ఇందిరమ్మ ఇళ్లు, ఉపాధి, భూ సంబంధ, ఇతర సమస్యలపై జిల్లా స్థాయిలో 11, మండల స్థాయిలో 9 దరఖాస్తులు రావడం జరిగిందని వెల్లడించారు.ఈ సందర్భంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణిలో 30 రోజులకు పైగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను గుర్తించి, తక్షణమే వాటిని క్లియర్ చేయాలని స్పష్టం చేశారు. ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులను ఎక్కడా ఆలస్యం చేయకుండా సత్వరమే పరిష్కరించాలని సూచించారు. అలాగే నిర్దేశిత లక్ష్యాలను షెడ్యూల్ ప్రకారం యథావిధిగా, సకాలంలో పూర్తి చేసేలా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. బాలికల, బాలుర హాస్టళ్లలో మెనూ అమలు, రికార్డుల నిర్వహణ, మౌలిక వసతులపై నిరంతరం తనిఖీలు నిర్వహించాలని, ముఖ్యంగా భోజన వసతులు, ఇతర అంశాలపై ఫిర్యాదులు వచ్చినందున ప్రత్యేక కాంప్లెక్సులు, హాస్టళ్లలో క్షుణ్ణంగా పరిశీలన నిర్వహించాలని ఆదేశించారు. హాస్టళ్ల తనిఖీలలో ఏవైనా లోపాలు లేదా ఇబ్బందులు గుర్తిస్తే, వాటిని వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి తక్షణ విచారణ చేపట్టి పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజావాణిలో డిఆర్ఓ స్రవంతి, డీఆర్డీఓ రవీందర్, ఈడి ఎస్సీ కార్పొరేషన్ మనోహర్, వివిధ శాఖల జిల్లా, మండల స్థాయి అధికారులు, సిబ్బంది, అర్జిదారులు, తదితరులు పాల్గొన్నారు.

పేకాటలో 125 కేసులలో 649 మంది..

• రూ. 13,07,380 స్వాధీనం : పోలీస్ కమిషనర్

(నిజామాబాద్ ప్రతినిధి, సాక్షర): నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలో దీపావళి పండుగ సందర్భంగా ఈనెల 07 నుండి 09వ తేదీ ఉదయం 11 గంటల వరకు పేకాట ఆడుతున్న వారిపై దాడులు నిర్వహించి 125 కేసులు నమోదు చేసినట్లు నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య, ఐపీఎస్ తెలిపారు.నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలోని నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్లలో మొత్తం 125 కేసులు నమోదు చేసి మొత్తం రూ. 13,07,380 స్వాధీనం చేసుకోవడం జరిగిందని కమిషనర్ తెలిపారు.నిజామాబాద్ డివిజన్ లో మొత్తం కేసులు 29, పట్టుబడిన వ్యక్తులు 175 మంది, రూ. 5,25,370 స్వాధీనం చేసుకున్నారు.

సంస్కృతి, సంప్రదాయాలు భావితరాలకు అందించాలి : సోయం బాపూరావు



- ఘనంగా వాయిపేటలో దండారి, గుస్సాడి ఉత్సవాలు

(సిరికొండ, సాక్షర): మన ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలు భావితరాలకు అందించాలని మాజీ ఎంపీ సోయం బాపూరావు అన్నారు. సిరికొండ మండలంలోని వాయిపేట గ్రామంలో నిర్వహించిన ఆదివాసీల సంప్రదాయ పండుగ దండారి, గుస్సాడి ఉత్సవాల్లో మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే, రాజ్ గోండ్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు సోయం బాపూరావు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆదివాసీ సంప్రదాయ నృత్యాలు, కళారూపాలను వీక్షించి ఉత్సవాల్లో పాల్గొన్న నాయకులు, గ్రామస్తులతో ఆత్మీయంగా మమేకమయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివాసీల దండారి, గుస్సాడి ఉత్సవాలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని అన్నారు. ఆదివాసీల ఆచార వ్యవహారాలు, కళలు, సంస్కృతిని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఇలాంటి సంప్రదాయ పండుగలను భావితరాలకు అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. ఆదివాసీ ప్రజల సంస్కృతి, సంప్రదాయాలకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ గౌరవం ఇస్తుందన్నారు.అలాగే గ్రామంలో రోడ్డు, విద్యుత్ సమస్య ఉందని, ఆ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అందిస్తామన్నారు. కొన్ని రోజుల క్రితం గ్రామంలో నేల కొన్న సమస్య కేసు విషయంలో ఎవరూ అధైర్య పడవద్దని, తాను ఆదివాసులకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఎలినో ప్రభావం ఆదిలాబాద్ జిల్లాకు తీవ్రంగా ఉంటుందని, ప్రతి ఒక్కరూ నీటిని, విద్యుత్ ను వృధా చేయకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు.కార్యక్రమంలో పెందూర్ శంభూ మహారాజ్, కినక శంభూ మహారాజ్, మండల కన్వీనర్ కంచం లక్ష్మణ్, డిసిసి ఉపాధ్యక్షులు మాధవ్ రావు పటేల్, మండల సర్పంచ్ ల సంఘం అధ్యక్షులు బొడ్డు దత్తు, సుంకిడి సర్పంచ్ రాథోడ్ గణపత్, సొంపెల్లి సర్పంచ్ లక్ష్మీకాంత్, వాయిపేట ఉప సర్పంచ్ అవినాష్, లక్ష్మీపుర్ సర్పంచ్ కుంరం దీపక్, ఉప సర్పంచ్ లు తోకల రాజు, భీంరావ్, రాజ్ గోండ్ మండల అధ్యక్షులు యాదవ్ రావు, మాజీ అధ్యక్షులు ఇమామ్, డైరెక్టర్లు పూర్కా జగన్, దుర్వ ఆనంద్, పోయాం భారీకరావు, కిషన్ పటేల్, వసంత్ రావు, మెస్రం నగేష్, జల్లు, గంగారాం, జల్పత్, దేవరీ, పటేళ్లు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

బాసరలో అక్రమంగా ఆక్రమించిన దుకాణాలను తొలగించాలి



(నిర్మల్ ప్రతినిధి, సాక్షర) బాసర మండల కేంద్రంలోని గ్రామపంచాయతీకి చెందిన దుకాణాలను కొందరు అక్రమంగా ఆక్రమించుకుని వ్యాపారాలు నిర్వహిస్తున్నారని గ్రామ యువకులు ఆరోపించారు. గ్రామపంచాయతీ కార్యాలయం ముందు, పంచాయతీ ఆవరణలో, బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో ఉన్న దుకాణాలను కొందరు అక్రమంగా ఆక్రమించుకుని వ్యాపారాలు నిర్వహిస్తున్నారని, మరికొందరు వాటిని ఇతరులకు అద్దెకు ఇస్తూ ఆర్థికంగా లబ్ధి పొందుతున్నారని గ్రామానికి చెందిన యువకులు ఎన్. యోగేష్, బాశెట్టి రాకేష్ తదితరులు ఆరోపించారు.ఈ మేరకు సోమవారం గ్రామపంచాయతీ కార్యదర్శి ప్రసాద్ గౌడ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యువకులు మాట్లాడుతూ గ్రామపంచాయతీకి చెందిన దుకాణాలన్నింటినీ అధికారులు తక్షణమే తమ ఆధీనంలోకి తీసుకోవాలని, నిబంధనల ప్రకారం పారదర్శకంగా టెండర్లు నిర్వహించి గ్రామానికి చెందిన నిరుద్యోగ యువతకు దుకాణాలను కేటాయించాలని డిమాండ్ చేశారు. ఇలా చేయడం ద్వారా స్థానిక నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు.తమ వినతిపై అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోకపోతే నిరుద్యోగ యువతను ఏకం చేసి గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. అవసరమైతే జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు వెళ్లి ఆందోళన చేపడతామని స్పష్టం చేశారు.

దీపాల పండుగను సమ్మె శిబిరంలోనే జరుపుకున్న ఎన్ హెచ్ ఎం ఉద్యోగులు




- 28వ రోజుకు చేరిన నిరవధిక సమ్మె
- ఉద్యోగ భద్రత కల్పించి రెగ్యులరైజ్ చేయాలని ప్రభుత్వానికి వేడుకోలు

నిర్మల్ సాక్షర: నిర్మల్ జిల్లా ఇన్ హెచ్ఎం జేఏసీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న నిరవధిక సమ్మె సోమవారం 28వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సమ్మెలో పాల్గొంటున్న ఎన్ హెచ్ ఎం ఉద్యోగులు దీపావళి పండుగను సమ్మె శిబిరంలోనే జరుపుకున్నారు. కుటుంబ సభ్యులు, పిల్లలతో కలిసి ఆనందంగా జరుపుకోవాల్సిన దీపావళి పండుగను ఉద్యోగ భద్రత కోసం రోడ్డుపై టెంట్ కింద నిరసన శిబిరంలో జరుపుకోవాల్సి రావడం పట్ల ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. సమ్మె శిబిరంలో దీపాలు వెలిగించి, ఒకరికొకరు మిఠాయిలు పంచుకుంటూ పండుగను జరుపుకున్నారు. తమ జీవితాల్లో కూడా వెలుగులు నింపాలని, కాంట్రాక్ట్ ఉద్యోగులుగా కొనసాగుతున్న తమను రెగ్యులరైజ్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ..... ఇంట్లో కుటుంబ సభ్యులు, పిల్లలతో కలిసి జరుపుకోవాల్సిన దీపావళి పండుగను సమ్మె శిబిరంలో జరుపుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీపావళి అంటే చీకటిని తొలగించి వెలుగులు నింపే పండుగ అని, అదేవిధంగా తమ కాంట్రాక్ట్ ఉద్యోగ జీవితాల్లోని చీకటిని తొలగించి రెగ్యులరైజేషన్ రూపంలో వెలుగులు నింపాలని ప్రభుత్వాన్ని కోరారు. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కారమయ్యే వరకు పండుగలైనా, పబ్బాలైనా సమ్మె శిబిరంలోనే జరుపుకుంటామని స్పష్టం చేశారు.

ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల ప్రధాన డిమాండ్లు.....1)ఎన్ హెచ్ ఎం ఉద్యోగులందరినీ వెంటనే రెగ్యులరైజ్ చేయాలి. 2)సమాన పనికి సమాన వేతనం ప్రాతిపదికన 100 శాతం గ్రాస్ శాలరీ చెల్లించాలి.3) పెండింగ్‌లో ఉన్న 5 శాతం ఇంక్రిమెంట్,8శాతం లాయల్టీ బోనస్‌ను వెంటనే విడుదల చేయాలి.ప్రభుత్వం స్పందించి తమ సమస్యలను పరిష్కరించి ఉద్యోగ భద్రత కల్పించాలని ఉద్యోగులు విజ్ఞప్తి చేశారు.

ధనిక, పేద అనే తేడా లేకుండా ప్రతి విద్యార్థికీ ఆధునిక సాంకేతిక విద్య అందాలి



- డాన్ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ వసీ ఉర్ రహ్మాన్
- గొడలు నేలలే డిజిటల్ క్లాస్ రూమ్ లు... మ్యాజిక్ టచ్ తో సరికొత్త విద్యాబోధన

(హైదరాబాద్/ ఆదిలాబాద్, సాక్షర): పుస్తకాలకే పరిమితమైన చదువుకు సాంకేతికతను జోడించి విద్యార్థుల్లో అభ్యాస ఆసక్తిని పెంచే లక్ష్యంతో మఖ్సూసీ గ్రూప్ రూపొందించిన 'మ్యాజిక్ టచ్ ఇంటరాక్టివ్ లెర్నింగ్' విధానం అందుబాటులోకి వచ్చింది. మలక్ పేటలోని సంస్థ ప్రధాన కార్యాలయంలో ఆదివారం డాన్ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ వసీ ఉర్ రహ్మాన్ ఈ విధానాన్ని ప్రారంభించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధనిక, పేద అనే తేడా లేకుండా ప్రతి విద్యార్థికీ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన విద్య అందాలని ఆకాంక్షించారు. నర్సరీ నుంచి ఉన్నత విద్య వరకు డిజిటల్ బోధన ఎంతో అవసరమని పేర్కొన్నారు. విద్యార్థులు స్వయంగా పాల్గొంటూ, నేర్చుకునే ఇలాంటి విధానాలు చదువుపై ఆసక్తిని పెంచుతాయని చెప్పారు.మ్యాజిక్ టచ్ ద్వారా తరగతి గది గోడలు, నేలలు, బల్లలను టచ్ ఆధారిత డిజిటల్ బోధనా వేదికలుగా మారుస్తారు. ప్రీ ప్రైమరీ నుంచి 12వ తరగతి వరకు విద్యార్థుల స్థాయికి అనుగుణంగా పాఠ్యాంశాలు, విద్యా ఆటలు, అభ్యాస కార్యక్రమాలు అందుబాటులో ఉంటాయి. నర్సరీ పిల్లలు గోడపై కనిపించే కూడికలకు సమాధానాలు ఇవ్వడం, ఎల్ కేజీ విద్యార్థులు నేలపై కనిపించే అక్షరాలను గుర్తించడం, పదో తరగతి విద్యార్థులు రేఖాగణితం సమస్యలను స్పర్శ ద్వారా పరిష్కరించడం వంటి వినూత్న బోధనా పద్ధతులు ఇందులో ఉన్నాయి.సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, రాష్ట్ర విద్యా మండళ్లతో పాటు అన్ని ప్రచురణ సంస్థల పాఠ్యాంశాలకు ఈ విధానం మద్దతు ఇస్తుందని మఖ్సూసీ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ మీరాన్ మఖ్సూసీ తెలిపారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ లోని నిరుపేద విద్యార్థులకు సైతం ఈ సాంకేతిక విద్యను చేరువ చేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా మీడియా అక్రిడేషన్ కమిటీ సభ్యులు డాక్టర్ సయ్యద్ ఇక్రాములా హుసైనీతో పాటు సంస్థ సిబ్బంది, పలువురు విద్యాసంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.పాఠశాలల్లో ఉచిత ఇన్ స్టాలేషన్, పాఠ్యపుస్తకాలు, పరికరాల డెలివరీ, సెటప్, ఉపాధ్యాయులకు శిక్షణతో పాటు సాంకేతిక సహాయాన్ని ఉచితంగా అందించనున్నట్లు సంస్థ ప్రకటించింది. ఆసక్తి గల పాఠశాలలు ఉచిత డెమో కోసం 63008 99621 నంబరులో లేదా Meeran.maqsusi@maqsusi.com ద్వారా సంప్రదించాలని సూచించింది. వివరాలకు maqsusi.com ను సందర్శించవచ్చు.

పని చేసినా పైసల్లేవ్.. పరిశ్రమలు పరేషాన్!



యంత్రాలు తిరుగుతున్నాయి. కార్మికులు పనిచేస్తున్నారు. సరుకు తయారవుతోంది. మార్కెట్‌లో అమ్మకాలు కూడా జరుగుతున్నాయి. కానీ చేసిన పనికి రావాల్సిన డబ్బు మాత్రం సకాలంలో చేతికి అందడం లేదు. బిల్లులు పేరుకుపోతున్నాయి. పెట్టుబడి బకాయిల్లో చిక్కుకుపోతోంది. కొన్ని సంస్థల్లో వేతనాలు చెల్లించాలన్నా అప్పు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. బ్యాంకు వాయిదాల చెల్లింపులపైనా ఒత్తిడి పెరుగుతోంది. దేశ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్న సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు ఎదురవుతున్న ప్రధాన సవాళ్లలో ఆలస్యపు చెల్లింపులు ఒకటి. కేంద్ర ఆర్థిక సర్వే 2025–26 ప్రకారం దేశ స్థూల దేశీయోత్పత్తిలో ఈ రంగం వాటా 31.1 శాతం, తయారీ రంగంలో 35.4 శాతం, ఎగుమతుల్లో 48.58 శాతం. ఇంతటి ప్రాధాన్యం ఉన్న రంగం నగదు ప్రవాహ సమస్యలతో సతమతమైతే దాని ప్రభావం ఉపాధి, ఉత్పత్తి, సరఫరా వ్యవస్థలపై పడుతుంది. అప్పు దొరికినా.. బాకీ మాత్రం తీరతలే! 2026 నవంబర్ 8వ తేదీ ఉదయం 10.30 గంటల నాటికి కేంద్ర ప్రభుత్వ ఉద్యమ్, ఉద్యమ్ అసిస్ట్ నమోదు వేదికల్లో కలిపి సుమారు 10.08 కోట్ల నమోదులు ఉన్నాయి. వాటికి అనుసంధానమైన ఉపాధి గణాంకాలు దాదాపు 44.63 కోట్లుగా నమోదయ్యాయి. అయితే పోర్టల్‌లోని నమోదులన్నీ ప్రస్తుతం క్రియాశీలంగా ఉన్న సంస్థలేనని, ఉపాధి గణాంకాలన్నీ ప్రస్తుత ఉద్యోగుల సంఖ్యేనని భావించరాదు. నమోదు సంఖ్యలు పెరగడం సానుకూల పరిణామమే అయినా, సంస్థలు నిలదొక్కుకోవడానికి మార్కెట్, పెట్టుబడి, సాంకేతికతతోపాటు చేసిన పనికి సకాలంలో చెల్లింపులు అందడం అత్యవసరం. కొనుగోలుదారుల నుంచి రావాల్సిన బకాయిలు నెలల తరబడి నిలిచిపోవడంతో చిన్న పరిశ్రమల నగదు ప్రవాహం దెబ్బతింటోంది. ఈ సమస్యను అధిగమించేందుకు రుణ సదుపాయాలు కల్పించడం ఒక్కటే సరిపోదు. సూక్ష్మ, చిన్న పరిశ్రమలకు రుణ లభ్యతను సులభతరం చేసే దిశగా రిజర్వ్ బ్యాంక్ 2026 ఫిబ్రవరి 9న కీలక ఆదేశాలు జారీ చేసింది. ఏప్రిల్ 1 నుంచి మంజూరయ్యే లేదా పునరుద్ధరించే రుణాలకు వర్తించే నిబంధనల ప్రకారం, ఈ సంస్థలకు రూ.20 లక్షల వరకు రుణాలపై బ్యాంకులు తాకట్టు భద్రత కోరరాదు. మంచి రుణ చరిత్ర, ఆర్థిక స్థితిగతులను పరిగణనలోకి తీసుకుని తమ అంతర్గత విధానం ప్రకారం ఈ పరిమితిని రూ.25 లక్షలకు పెంచుకునే వెసులుబాటు కూడా ఉంది. రుణగ్రహీత స్వచ్ఛందంగా బంగారం లేదా వెండిని తాకట్టుగా సమర్పిస్తే స్వీకరించేందుకు నిబంధనలు అనుమతిస్తున్నాయి. ఈ నిర్ణయాలు పెట్టుబడి అవసరాలకు కొంత ఊరటనిచ్చినా, కొనుగోలుదారుల నుంచి రావాల్సిన బకాయిల సమస్యను పరిష్కరించలేవు. అప్పులపై ఆధారపడి ఉత్పత్తిని కొనసాగించే పరిస్థితి మారాలంటే, చేసిన పనికి చెల్లింపులు సకాలంలో అందే వ్యవస్థ బలోపేతం కావాలి. చెల్లింపు ఆలస్యం.. చక్రవడ్డీ భారం ఎవరిపై? సూక్ష్మ, చిన్న సంస్థల ప్రయోజనాలను కాపాడేందుకు సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధి చట్టం–2006లోని 15, 16 సెక్షన్లు కీలక రక్షణ కల్పిస్తున్నాయి. అయితే ఈ చెల్లింపు రక్షణలు చట్టప్రకారం అర్హత కలిగిన సూక్ష్మ, చిన్న సరఫరాదారులకే వర్తిస్తాయి. కొనుగోలుదారు, సరఫరాదారు మధ్య రాతపూర్వక ఒప్పందం ఉన్నా చెల్లింపు గడువు వస్తువులు లేదా సేవలు స్వీకరించిన లేదా చట్టప్రకారం స్వీకరించినట్లుగా పరిగణించే తేదీ నుంచి 45 రోజులకు మించరాదు. ఒప్పందం లేకపోతే స్వీకరణ తేదీ నుంచి 15 రోజుల గడువు ముగిసిన మరుసటి రోజును నిర్ణీత చెల్లింపు దినంగా పరిగణిస్తారు. గడువు దాటితే ఆర్బీఐ ప్రకటించిన బ్యాంకు వడ్డీ రేటుకు మూడింతల చొప్పున నెలవారీ చక్రవడ్డీ చెల్లించాల్సి ఉంటుంది. 2026 సవరణ చట్టంలోని సెక్షన్ 15ఏ ప్రకారం కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థల నుంచి కొనుగోలు చేసే వస్తువులు, సేవలకు సంబంధించిన బిల్లుల పరిష్కారాన్ని ఆర్బీఐ అనుమతించిన టీ-రెడ్స్ వేదిక ద్వారా నిర్వహించాలి. కేంద్ర ప్రభుత్వం నోటిపై చేసే ఇతర సంస్థలు, రాష్ట్ర ప్రభుత్వాలు నోటిపై చేసే రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలు, ఇతర సంస్థలకూ ఈ నిబంధన వర్తిస్తుంది. టీ-రెడ్స్ ద్వారా బిల్లుల పరిష్కారానికి మార్గం కల్పించినప్పటికీ, ప్రతి బిల్లుపై ముందస్తు ఆర్థిక సదుపాయం పొందడం సరఫరాదారుకు తప్పనిసరి కాదు. బిల్లు విలువపై ముందస్తు నగదు పొందాలా వద్దా అన్నది సరఫరాదారు ఎంపిక. సమాధాన్ పోర్టల్‌తో అనుసంధానమైన ఆన్‌లైన్ వివాద పరిష్కార వేదికతోపాటు దేశవ్యాప్తంగా ఏర్పాటు చేసిన 161 సూక్ష్మ, చిన్న పరిశ్రమల సదుపాయ మండళ్లు బకాయి వివాదాల పరిష్కారానికి అందుబాటులో ఉన్నాయి. హైదరాబాద్‌లో 2026 ఆగస్టు 25న నిర్వహించిన పరిశ్రమల అదాలత్ ద్వారా 65 బకాయి వివాదాలు, రూ.8.29 కోట్ల మేర పరిష్కారమయ్యాయి. ఇటువంటి ప్రయత్నాలు నిరంతర ప్రక్రియగా మారాలి. సవరణ చట్టంలోని అన్ని నిబంధనలు ఒకేసారి అమల్లోకి రాలేదన్న విషయాన్ని కూడా గుర్తించాలి. అక్టోబర్ 15 నుంచి నోటిఫికేషన్‌లో పేర్కొన్న సెక్షన్లు అమల్లోకి వచ్చాయి. సెక్షన్ 12 మాత్రం డిసెంబర్ 15 నుంచి అమల్లోకి రానుంది. గేమ్ ఛేంజరా.. మరో స్కీమా? చిన్న, మధ్యతరహా సంస్థల వృద్ధికి ఊతమిచ్చేలా కేంద్ర మంత్రివర్గం 2026 అక్టోబర్ 6న రూ.10 వేల కోట్ల ప్రభుత్వ నిబద్ధతతో ఎస్ఎంఈ వృద్ధి నిధి ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. వృద్ధి సామర్థ్యం, ఆర్థిక సాధ్యత ఉన్న సంస్థలకు ప్రత్యక్ష ఈక్విటీ పెట్టుబడుల ద్వారా తోడ్పాటు అందించడం దీని ప్రధాన ఉద్దేశం. ఇది సాధారణ బ్యాంకు రుణ పథకం కాదు. పెట్టుబడి అందుబాటుతోపాటు సంస్థల నిర్వహణ సామర్థ్యం, నాణ్యత, సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యాల పెంపుపైనా దృష్టి అవసరం. ఐక్యరాజ్యసమితి వాణిజ్య, అభివృద్ధి సంస్థ అంచనాల ప్రకారం 2026లో ప్రపంచ ఆర్థిక వృద్ధి 2.6 శాతంగా, స్థిర ధరల వద్ద వస్తు, సేవల వాణిజ్య వృద్ధి సుమారు 4 శాతంగా ఉండనుంది. కృత్రిమ మేధతో వచ్చే ప్రయోజనాలు అన్ని దేశాలకు, సంస్థలకు సమానంగా అందడం లేదు. ఈ పోటీలో భారతీయ చిన్న పరిశ్రమలు నిలదొక్కుకోవాలంటే నూతన సాంకేతికతను అందిపుచ్చుకోవడం, అంతర్జాతీయ నాణ్యతా ప్రమాణాలను పాటించడం, ఎగుమతి మార్కెట్లను విస్తరించడం అనివార్యం. ప్రభుత్వ పథకాలు ప్రకటనలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో ఫలితాలివ్వాలి. రుణం అందించడం మొదటి అడుగు మాత్రమే. చేసిన పనికి పైసలు సకాలంలో అందడం, ఉత్పత్తికి తగిన మార్కెట్ లభించడం, ప్రపంచ పోటీలో నిలిచే సామర్థ్యం పెరగడం సాధ్యమైనప్పుడే చిన్న పరిశ్రమలు దేశ ప్రగతిలో కీలక పాత్ర పోషిస్తాయి. (వ్యాసకర్త: ఫిరోజ్ ఖాన్ సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్ట్ ఫోన్ 9640466464)

ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

- జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావు



(ఆసిఫాబాద్, సాక్షర): ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వరమే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి కిరణ్ కుమార్ తో కలిసి దరఖాస్తులు స్వీకరించారు. వాంకిడి మండలం డాబా గ్రామానికి చెందిన కొమురం కిశహద్రి తాను 30 సంవత్సరాల నుండి సాగు చేస్తున్న పోడభూమిని తన పేరిట పట్టా చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఆసిఫాబాద్ మండలం ఈదులవాడ గ్రామపంచాయతీ పరిధిలోని సింగారావుపేట గ్రామ ప్రజలు తమ గ్రామానికి శాశ్వత రహదారిని నిర్మించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. కాగజ్ నగర్ మండలం కొత్త సార్సాల గ్రామానికి చెందిన రైతులు తమకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఆసిఫాబాద్ మండలం బూరు గూడ గ్రామానికి చెందిన ప్రజలు తమ గ్రామంలో పాఠశాల ఎదురుగా గల బెల్ట్ షాపును తొలగించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. తిర్యాని మండలం మంగి పంచాయతీ పరిధిలోని శ్రీరాంపూర్ గూడ కు చెందిన మడావి రోజా తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. రెబ్బెన మండలం గంగాపూర్ గ్రామానికి చెందిన సాగాల చిన్నుబాయి గ్రామ శివారులో గతంలో తన కుమారుడి పేరిట గల పట్టా భూమిని తన పేరిట విరాట్ పట్టా చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు, అర్జీదారులు పాల్గొన్నారు.

దుర్గం శేఖర్‌కు ఆత్మీయ సన్మానం



- ఆదిలాబాద్ పార్లమెంట్ ఎస్సీ డిపార్ట్‌మెంట్ ఇన్‌చార్జిగా నియమితులైన దుర్గం శేఖర్‌కు పూర్వ విద్యార్థుల ఆత్మీయ అభినందనలు

ఆదిలాబాద్, సాక్షర: ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, టీపీసీసీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ రాష్ట్ర ఉపాధ్యక్షులు దుర్గం శేఖర్ గారు ఆదిలాబాద్ పార్లమెంట్ ఎస్సీ డిపార్ట్‌మెంట్ ఇన్‌చార్జిగా నియమితులైన సందర్భంగా, ఆదిలాబాద్. కైలాష్ నగర్ లో గల దుర్గం శేఖర్ నివాసం లో జెడ్పీ హైస్కూల్ ఉట్నూర్ 1990–91 ఎస్ఎస్సీ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థి మిత్రులు దుర్గం శేఖర్ లావణ్య దంపతులకు ఆత్మీయంగా సన్మానించి, హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా చిన్ననాటి పాఠశాల జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ, తమతో కలిసి చదువుకున్న మిత్రుడు నేడు రాజకీయ, సామాజిక రంగాల్లో వివిధ బాధ్యతలు చేపడుతూ ముందుకు సాగడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఈ నూతన బాధ్యతలతో ప్రజలకు, ముఖ్యంగా ఎస్సీ వర్గాల అభ్యున్నతికి మరింత సేవలందించాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టి ప్రజాసేవలో ముందుకు సాగాలని 9091 బ్యాచ్ మిత్రులు మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. దీపావళి పండుగ సందర్భంగా మిఠాయి తిని శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఆత్మీయ సన్మాన కార్యక్రమం పాత స్నేహబంధాలకు, ఆత్మీయతకు ప్రతీకగా నిలిచింది. ఈ సన్మానం కార్యక్రమం లో పాల్గొన్నా మిత్రులు తాజోద్దీన్. బి శ్రీనివాస్. అజంఖాన్. అంజన్న. రాజేశ్వర్ రెడ్డి. శంకరయ్య. అంజన్న. స్వరూప రెడ్డి. వాణి. వనజ. స్వామి. జి. శ్రీనివాస్. తిరుపతి. కృష్ణ. సత్యం తదితరులు పాల్గొన్నారు

దండారి ఉత్సవాల్లో బలరాం జాదవ్



(తలమడుగు, సాక్షర): మండలంలోని పల్సీ (బి) గ్రామస్తుల ఆహ్వానం మేరకు దండారి ఉత్సవాల్లో రాష్ట్ర అధ్యాపకుల సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా గ్రామస్తులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే దండారి ఉత్సవాల్లో పాల్గొని కళాకారులతో కలిసి ఉత్సవాల్లో సందడి చేశారు. ఆదివాసీల ఆచార వ్యవహారాలు, సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.

మండల రైతులకు బారాసా అండ : జిల్లా కార్యదర్శి జాడి గంగాధర్



(జన్నారం, సాక్షర): మండలంలోని రైతులకు ఎల్లవేళలా భారత రాష్ట్ర సమితి అండగా ఉంటుందని పార్టీ మంచిర్యాల జిల్లా కార్యదర్శి, జన్నారం మండల సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షులు జాడి గంగాధర్ అన్నారు.సోమవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని రైతులు వేసిన వరిపంటకు కడెం ఆయకట్టు నీటిని నిలిపివేయడంతో పంటల పరిస్థితి ఏమిటని అన్నదాతలు ఆందోళనలో పడిన సమయంలో వారికి మేమున్నాం అంటూ పార్టీ ఆధ్వర్యంలో రైతులతో కలిసి చింతగూడ, తపాలాపూర్, రాంపూర్, తిమ్మాపూర్ గ్రామాలతో పాటు మండలకేంద్రంలో సైతం పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలు చేయడంతో ప్రభుత్వం దిగివచ్చి ఇప్పుడు నీటిని విడుదల చేసిందని ఆయన అన్నారు.రాష్ట్రంలోని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం మాది ప్రజా పాలన ప్రభుత్వం, మాది రైతు ప్రభుత్వం అంటూ పెద్ద ప్రకటనలు చేయడం కాదని, క్షేత్రస్థాయిలో రైతుల కష్టాలను పరిశీలించి వారికి కావలసినది అందించి వారికి ఎటువంటి నష్టం జరగకుండా చేసినప్పుడే ఇటువంటి ప్రకటనలు చేయాలని ఆయన విమర్శించారు.గతంలో 10 సంవత్సరాలు తమ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని అన్నదాతలకు ఎప్పుడు ఎటువంటి నష్టం జరగకుండా తమ ప్రభుత్వ పాలకులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అహర్నిశలు కృషి చేసేవారని ఆయన అన్నారు.

ప్రజావాణి అర్జీల పరిష్కారంలో జాప్యం చేయొద్దు

- నిర్ణీత గడువులోగా సమస్యలను పరిష్కరించాలి కలెక్టర్ భవేష్ మిశ్రా
- అటల్ పెన్షన్ యోజన అమలులో నిర్మల్ జిల్లాకు ఎక్సలెన్స్ అవార్డు



(నిర్మల్ ప్రతినిధి, సాక్షర) ప్రజావాణిలో ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల ప్రకారం నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి కలెక్టర్ అర్జీలను స్వీకరించారు. ఇందిరమ్మ ఇళ్లు, ఉపాధి, భూ సమస్యలు తదితర అంశాలకు సంబంధించిన దరఖాస్తులను పరిశీలించి, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ నెల 6న హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పీఎఫ్ఆర్డీఏ సీజీఎం ఆశుతోష్ కుమార్ చేతుల మీదుగా జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రాంగోపాల్ అవార్డును అందుకున్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆ అవార్డును జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రాకు అందజేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ ఎల్‌డీఎం రాంగోపాల్‌ను అభినందించడంతో పాటు, జిల్లాకు గుర్తింపు తీసుకువచ్చిన బ్యాంకు అధికారులు, సిబ్బందిని ప్రశంసించారు. భవిష్యత్తులోనూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా బ్యాంకులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు వెంకట మాధవరావు, రాథోడ్ రమేష్, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రపంచం మారుతోంది.. మనం మారుతున్నామా?

• ఏఐ నుంచి యుద్ధాల వరకు...



వాతావరణ మార్పుల నుంచి రైతుల భవిష్యత్తు వరకు.. కామారెడ్డి జిల్లాకూ ముడిపడిన ప్రపంచ పరిణామాలు! సాంకేతికతను అందిపుచ్చుకుంటేనే ఉపాధి.. ప్రపంచ పరిణామాలను అర్థం చేసుకుంటేనే అభివృద్ధి.. ప్రకృతిని కాపాడుకుంటేనే వ్యవసాయానికి భవిష్యత్తు! ప్రపంచం వేగంగా మారుతోంది. ఒకప్పుడు మనకు దూరంగా జరిగే అంతర్జాతీయ పరిణామాలు ఇప్పుడు మన ఇంటి ఖర్చుల నుంచి వ్యవసాయం వరకు ప్రభావం చూపుతున్నాయి. కృత్రిమ మేధస్సు (ఏఐ), అంతర్జాతీయ యుద్ధాలు, వాతావరణ మార్పులు.. ఇవి కేవలం ప్రపంచ వార్తలు మాత్రమే కాదు. మన ఉద్యోగాలు, ఆర్థిక పరిస్థితి, రైతుల ఆదాయం, భవిష్యత్తు ఉపాధితో ముడిపడిన అంశాలు.వీటిని అర్థం చేసుకోవడం, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా మనల్ని మనం సిద్ధం చేసుకోవడం ఇప్పుడు ప్రతి ఒక్కరికీ అవసరం. ఏఐ ఉద్యోగాలను తింటుందా? కొత్త ఉపాధికి బాటలు వేస్తుందా? ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఎక్కువగా వినిపిస్తున్న ప్రశ్న ఇదే. ఏఐ వస్తే ఉద్యోగాలు పోతాయా? మనుషుల అవసరం తగ్గిపోతుందా?గతంలో కంప్యూటర్ వచ్చినప్పుడు కూడా ఇలాంటి భయాలే వ్యక్తమయ్యాయి. టైపిస్టులు, మాన్యువల్ రికార్డుల నిర్వహణ వంటి పనులు తగ్గిపోయాయి. అదే సమయంలో కంప్యూటర్ ఆపరేటర్లు, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, డేటా నిపుణులు, ఐటీ రంగంలో కొత్త ఉద్యోగాలు పుట్టుకొచ్చాయి.ఇప్పుడు ఏఐ విషయంలోనూ అలాంటి పరివర్తనే కనిపిస్తోంది. అయితే ఈసారి మార్పు వేగం మరింత ఎక్కువగా ఉండవచ్చు.ప్రపంచ ఆర్థిక వేదిక 2025 నివేదిక ప్రకారం, 2030 నాటికి ప్రపంచవ్యాప్తంగా వివిధ మార్పుల కారణంగా 17 కోట్ల కొత్త ఉద్యోగాలు ఏర్పడే అవకాశం ఉండగా, 9.2 కోట్ల ఉద్యోగాలు కనుమరుగయ్యే ప్రమాదం ఉంది. అంటే నికరంగా 7.8 కోట్ల ఉద్యోగాలు పెరిగే అంచనా ఉంది. ఇవి అంచనాలే తప్ప హామీలు కావు. అసలు సూత్రం ఏమిటంటే.. ఏఐ మనిషిని పూర్తిగా తీసేయకపోవచ్చు. కానీ మనిషి చేసే అనేక పాత పనులను మార్చేస్తుంది.ఒకప్పుడు పేపర్ కట్టింగ్స్ సేకరించి వార్తలు తయారు చేసేవారు. ఇప్పుడు డిజిటల్ టూల్స్‌తో సమాచారాన్ని విశ్లేషించి, వేగంగా వార్తలను రూపొందించవచ్చు. పాత పద్ధతుల్లోనే ఉండిపోయినవారికి పోటీ పెరుగుతుంది. కొత్త సాంకేతికతను నేర్చుకున్నవారికి కొత్త అవకాశాలు వస్తాయి. మన జర్నలిస్టులకు ఇదొక హెచ్చరిక.. ఒక అవకాశమూ! ఏఐ సహాయంతో వార్తల డ్రాఫ్ట్ తయారు చేయడం, సమాచారాన్ని విశ్లేషించడం, డేటాను పరిశీలించడం, ఫొటోలకు వివరణలు రూపొందించడం నేర్చుకోవాలి. అయితే వాస్తవ నిర్ధారణ, క్షేత్రస్థాయి పరిశీలన, మానవీయ కోణం, నైతిక విలువలు మాత్రం జర్నలిస్టు బాధ్యతగానే ఉండాలి. ఏఐ రాసినదాన్ని గుడ్డిగా ప్రచురించడం జర్నలిజం కాదు. ఏఐని ఉపయోగించి మరింత మెరుగైన జర్నలిజం చేయడమే అసలైన నైపుణ్యం.ఏఐ మన శత్రువు కాదు.. మన పనితీరును పెంచే కొత్త సాధనం. దాన్ని ఉపయోగించడం నేర్చుకున్నవారే రేపటి పోటీలో ముందుంటారు. ఇజ్రాయెల్–ఇరాన్ ఘర్షణ.. కామారెడ్డి రైతుకు ఎందుకు సంబంధం? ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య యుద్ధం జరుగుతుంటే మన కామారెడ్డికి ఏమిటి సంబంధం? అనే ప్రశ్న రావచ్చు.సంబంధం చాలా ఉంది! మధ్యప్రాచ్యంలో యుద్ధాలు తీవ్రమైతే ప్రపంచ చమురు సరఫరాపై ప్రభావం పడుతుంది. ముఖ్యంగా హార్ముజ్ జలసంధి ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలకమైన మార్గం. ఈ మార్గంలో అంతరాయం ఏర్పడితే అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు పెరిగే అవకాశం ఉంటుంది. చమురు ధరలు పెరిగితే రవాణా ఖర్చులు, డీజిల్ ధరలు, ఎరువుల తయారీ, పరిశ్రమల ఉత్పత్తి వ్యయాలపై ఒత్తిడి పెరుగుతుంది. చివరకు నిత్యావసర వస్తువుల ధరలపైనా ప్రభావం పడుతుంది. దీని ప్రభావం మన రైతుపైనా పడుతుంది.విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, వ్యవసాయ యంత్రాల నిర్వహణ, పంటను మార్కెట్‌కు తరలించే రవాణా ఖర్చులు పెరిగితే రైతు పెట్టుబడి పెరుగుతుంది. పంటకు తగిన గిట్టుబాటు ధర రాకపోతే నష్టభారం మరింత పెరుగుతుంది.అయితే ఒక విషయం గుర్తుంచుకోవాలి. యుద్ధం జరిగిందంటే వెంటనే పెట్రోల్ ధర పెరుగుతుందని, రైతు పంట ధర పడిపోతుందని చెప్పలేం. అంతర్జాతీయ సరఫరా, ప్రభుత్వ విధానాలు, నిల్వలు, మార్కెట్ డిమాండ్ వంటి అనేక అంశాలు ధరలను నిర్ణయిస్తాయి.ఇది కేవలం మతపరమైన ఘర్షణగా చూడలేం. భద్రత, అణు కార్యక్రమాలు, ప్రాంతీయ ఆధిపత్యం, రాజకీయ ప్రయోజనాలతో పాటు చమురు, వాణిజ్య మార్గాల భద్రత కూడా ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు కీలకం.భారత్ వంటి చమురు దిగుమతులపై ఆధారపడే దేశాలకు ఇలాంటి పరిణామాలు సవాలుగా మారుతాయి. రష్యా సహా వివిధ దేశాల నుంచి చమురు దిగుమతులను విస్తరించడం ద్వారా భారత్ సరఫరా వనరులను వైవిధ్యపరచుకునే ప్రయత్నం చేస్తోంది.ప్రపంచంలో ఎక్కడ యుద్ధం జరిగినా దాని ఆర్థిక ప్రకంపనలు మన గ్రామానికి, మన రైతు బడ్జెట్‌కు చేరవచ్చు. అందుకే అంతర్జాతీయ రాజకీయాలను అర్థం చేసుకోవడం కూడా సామాన్యుడికి అవసరమే! వాతావరణ మార్పులు.. మన పొలాల భవిష్యత్తుకు సవాల్! వర్షాలు సకాలంలో కురుస్తున్నాయా? ఎండలు సాధారణంగానే ఉంటున్నాయా? భూగర్భ జలాలు అందుబాటులో ఉన్నాయా? అనే ప్రశ్నలు ఇప్పుడు రైతుల ముందున్నాయి. ఒకప్పుడు కాలానుగుణంగా సాగిన వ్యవసాయ పనులు ఇప్పుడు వాతావరణ అనిశ్చితి కారణంగా సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. ఎక్కడో అతివృష్టి, మరెక్కడో అనావృష్టి.. కొన్ని ప్రాంతాల్లో అధిక ఉష్ణోగ్రతలు, మరికొన్ని చోట్ల అనూహ్య వర్షాలు రైతుల ప్రణాళికలను దెబ్బతీస్తున్నాయి. ఇది కేవలం ఢిల్లీ సమస్య కాదు. దేశంలోని ప్రతి ప్రాంతం ఏదో ఒక రూపంలో వాతావరణ మార్పుల ప్రభావాన్ని ఎదుర్కొంటోంది.కామారెడ్డి జిల్లా వంటి వ్యవసాయ ఆధారిత ప్రాంతాల్లో ఈ సమస్య మరింత ప్రాధాన్యత సంతరించుకుంటోంది. వరి, మొక్కజొన్న, పసుపు వంటి పంటల సాగు నీటి లభ్యత, వర్షపాతం, ఉష్ణోగ్రతలపై ఆధారపడి ఉంటుంది. భూగర్భ జలాలపై అధిక ఆధారపడటం భవిష్యత్తులో సాగు ఖర్చులను పెంచే ప్రమాదం ఉంది.ఇక్కడ రైతులు ఆలోచించాల్సిన అంశం ఒక్కటే.. నీరు అందుబాటులో ఉన్నప్పుడే పంట వేయడం కాదు, భవిష్యత్తులో నీటి పరిస్థితులను అంచనా వేసుకుని పంటల ఎంపిక చేసుకోవడం ముఖ్యం.తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటలు, పంటల మార్పిడి, సూక్ష్మ సేద్యం, వర్షపు నీటి సంరక్షణ, నేల ఆరోగ్య పరిరక్షణపై దృష్టి పెట్టాలి. ప్రభుత్వం కూడా రైతులకు శాస్త్రీయ అవగాహన, మార్కెట్ సమాచారం, పంటల బీమా, ప్రత్యామ్నాయ పంటలకు ప్రోత్సాహం కల్పించాలి. వాతావరణ మార్పు ప్రకృతి సమస్య మాత్రమే కాదు.. అది వ్యవసాయ ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన సమస్య కూడా! కార్బన్ ట్యాక్స్.. మన రైతులకు కొత్త ప్రపంచ మార్కెట్ అవకాశం? ప్రపంచ దేశాలు ఇప్పుడు ఉత్పత్తుల తయారీలో ఎంత కాలుష్యం వెలువడుతోంది? ఎంత కార్బన్ విడుదలవుతోంది? అనే అంశాలకు ప్రాధాన్యత ఇస్తున్నాయి.యూరోపియన్ యూనియన్ అమలు చేస్తున్న కార్బన్ బోర్డర్ అడ్జస్ట్‌మెంట్ మెకానిజం ఇందుకు ఉదాహరణ. 2026 జనవరి నుంచి ఇది పూర్తిస్థాయి విధానంగా అమల్లోకి వచ్చింది. ప్రస్తుతం ఉక్కు, సిమెంట్, అల్యూమినియం, ఎరువులు, విద్యుత్, హైడ్రోజన్ వంటి నిర్దిష్ట రంగాలకు సంబంధించిన దిగుమతులపై ఉత్పత్తి సమయంలో వెలువడిన కార్బన్ ఆధారంగా నిబంధనలు వర్తిస్తున్నాయి.అంటే ప్రపంచ వాణిజ్యంలో పర్యావరణ ప్రమాణాలకు ప్రాధాన్యత పెరుగుతోంది.ఇది మన రైతులకు ఒక సందేశం ఇస్తోంది. రసాయనాల వినియోగాన్ని తగ్గించడం, నేల ఆరోగ్యాన్ని కాపాడటం, నీటిని పొదుపుగా వినియోగించడం, ప్రకృతి ఆధారిత వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడం భవిష్యత్తులో మరింత ఉపయోగకరంగా మారవచ్చు.అయితే సహజ వ్యవసాయం చేశామంటే ఆటోమేటిక్‌గా విదేశీ మార్కెట్ దక్కదు. నాణ్యత, ధ్రువీకరణ, సరఫరా వ్యవస్థ, మార్కెటింగ్, సరైన ధర కూడా అవసరం.కామారెడ్డి రైతులు ఇప్పటి నుంచే ఈ మార్పులపై అవగాహన పెంచుకుంటే భవిష్యత్తులో కొత్త మార్కెట్ అవకాశాలను అందిపుచ్చుకోవచ్చు.ప్రకృతిని కాపాడే వ్యవసాయమే రేపటి తరాలకు ఆరోగ్యకరమైన ఆహారాన్ని, రైతులకు స్థిరమైన ఆదాయాన్ని అందించే మార్గం కావాలి. మార్పును చూసి భయపడకూడదు.. మార్పుకు సిద్ధం కావాలి! ఏఐ మన ఉద్యోగ ప్రపంచాన్ని మారుస్తోంది. అంతర్జాతీయ యుద్ధాలు మన ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేస్తున్నాయి. వాతావరణ మార్పులు మన వ్యవసాయ భవిష్యత్తును ప్రశ్నిస్తున్నాయి. ప్రపంచ వాణిజ్యం కొత్త పర్యావరణ ప్రమాణాల వైపు అడుగులు వేస్తోంది.ఈ నాలుగు పరిణామాల్లో ఒకే సందేశం కనిపిస్తోంది. కాలానికి అనుగుణంగా మారినవారే మనుగడ సాగిస్తారు.జర్నలిస్టు కొత్త సాంకేతికతను నేర్చుకోవాలి. యువత కొత్త నైపుణ్యాలను పెంచుకోవాలి. రైతు మారుతున్న వాతావరణానికి అనుగుణంగా పంటల ఎంపిక చేసుకోవాలి. పాలకులు భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని విధానాలు రూపొందించాలి. ప్రపంచం ఎటువైపు వెళ్తోందో తెలుసుకోవడం ఎంత ముఖ్యమో.. ఆ మార్పులను మన జీవితాలకు ఎలా అన్వయించుకోవాలో తెలుసుకోవడం అంతకంటే ముఖ్యం.ఎందుకంటే.. రేపటి ప్రపంచం కోసం ఎదురుచూసేవారు కాదు.. రేపటి ప్రపంచానికి ఈ రోజే సిద్ధమయ్యేవారే విజేతలు! (ఉక్కల్ కర్ రాజేందర్ నాథ్ , డీఏఈ ట్రైనీ జర్నలిస్ట్ కా మారెడ్డి జిల్లా మీడియా అక్రెడిటేషన్ కమిటీ సభ్యులు-944028710)

బేల మార్కెట్ లో పత్తి కొనుగోళ్లు వెంటనే ప్రారంభించాలి : జోగు రామన్న



• సోమవారం లోగా కొనుగోళ్లు చేపట్టకుంటే రైతులతో కలిసి భారీ ధర్నా : మాజీ మంత్రి

(బేల, సాక్షర): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ శక్తులకు అనుగుణంగా పాలన సాగిస్తూ రైతుల ప్రయోజనాలను విస్మరిస్తున్నాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న మండిపడ్డారు. బేల మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన బేల వ్యవసాయ మార్కెట్ లో పత్తి కొనుగోళ్ల పరిస్థితిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.మార్కెట్ ప్రారంభమై 20 రోజులు గడుస్తున్నప్పటికీ ఇప్పటివరకు సీసీఐతో పాటు ప్రైవేట్ వ్యాపారులు కూడా పత్తి కొనుగోళ్లు ప్రారంభించకపోవడం దారుణమన్నారు. రైతులు పండించిన పత్తిని విక్రయించుకునేందుకు ఎదురుచూస్తున్నా ప్రభుత్వ యంత్రాంగం పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. తక్షణమే సీసీఐ, ప్రైవేట్ కొనుగోలు కేంద్రాల ద్వారా పత్తి కొనుగోళ్లు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. వచ్చే సోమవారం లోగా కొనుగోళ్లు ప్రారంభించకపోతే బేల మండల కేంద్రంలో రైతులతో కలిసి భారీ ఎత్తున ధర్నాలు, నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ఎల్ నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొని రైతులు తీవ్రంగా నష్టపోయారని, ఎకరానికి పది క్వింటాళ్ల పత్తి దిగుబడి రావాల్సి ఉండగా ప్రస్తుతం ఒకటి, రెండు క్వింటాళ్లు మాత్రమే వస్తుండటంతో రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు తీసుకొచ్చి రైతులను ఆదుకుంటామని హామీలు ఇచ్చిన బీజేపీ ప్రజాప్రతినిధులు, నేటికీ కనీసం పంట నష్టపరిహారం అందించకపోవడం సిగ్గుచేటన్నారు.స్థానిక బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యేలు రైతుల సమస్యలపై దృష్టి సారించకపోవడం వారి చిత్తశుద్ధికి నిదర్శనమని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం విదేశీ దిగుమతులపై సుంకాలు ఎత్తివేయడం వల్ల దిగుమతులు పెరిగి దేశీయంగా పత్తి సాగు చేస్తున్న తెలంగాణ రైతాంగానికి తీవ్ర నష్టం వాటిల్లుతోందన్నారు. మరోవైపు పత్తి ధరలు తగ్గేలా ప్రభుత్వ విధానాలు రైతుల ప్రయోజనాలకు విరుద్ధంగా ఉన్నాయని ఆరోపించారు.ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం రైతుల సమస్యలపై చిత్తశుద్ధితో స్పందించి బేల మార్కెట్ లో వెంటనే పత్తి కొనుగోళ్లు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టి రైతులకు అండగా నిలుస్తామని జోగు రామన్న స్పష్టం చేశారు.ఈ సమావేశంలో రౌతు మనోహర్, సతీష్ పవర్, దేవన్న, మస్కి తేజరావు, విప్పిన్, మంగేష్, దైవన్న, మురళి, ఎం.డి. అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

గుస్సాడి, దండారీ నృత్యాలు ఆదివాసీల ప్రత్యేక సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకలు : సోయం బాపూరావు

• సకినాపూర్, నాడుం పల్లిలో గుస్సాడి, దండారీ వేడుకలు



(తలమడుగు, సాక్షర): మండలంలోని సకినాపూర్, నాడుం పల్లి గ్రామాల్లో నిర్వహించిన గుస్సాడి, దండారీ వేడుకల్లో మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే, రాజ్ గోండ్ సేవ సమితి రాష్ట్ర అధ్యక్షులు సోయం బాపూరావు పాల్గొన్నారు.గ్రామానికి చేరుకున్న నాయకులకు ఆదివాసీ సంప్రదాయ పద్ధతిలో గుస్సాడిలు ఘన స్వాగతం పలికి అతిథులకు శాలువాతో సన్మానించారు. గుస్సాడి, దండారీ నృత్యాలను తిలకిస్తూ కళాకారులను, గ్రామస్తులను ఉత్సాహపరిచారు.ఈ సందర్భంగా సోయం బాపూరావు మాట్లాడుతూ గుస్సాడి, దండారీ నృత్యాలు ఆదివాసీల ప్రత్యేక సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకలని అన్నారు. తరతరాలుగా వస్తున్న ఆదివాసీ ఆచారాలు, సంప్రదాయాలు, కళలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అలాగే ఆదివాసీ యువత చదువులపై దృష్టి సారించి ఉన్నత ఉద్యోగాలు సాధించాలన్నారు.కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. గుస్సాడి, దండారీ వేడుకలు నిర్వహించుకునేందుకు అవసరమైన షెడ్ల నిర్మాణంతో పాటు ప్రత్యేక నిధులు కేటాయిస్తూ ఆదివాసీ కళలు, సంస్కృతికి ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. ఆదివాసీ కళాకారులను ప్రోత్సహిస్తూ వారి సంప్రదాయాలకు తగిన గుర్తింపు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఇన్ చార్జ్ ఆడే గజేందర్, మాజీ జెడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి, మండల అధ్యక్షులు కాస్తల ప్రతాప్, గ్రామ పటేల్ నైతం అయ్యు, ఆత్రం జంగు, సిడం చిన్ను, గ్రామ సర్పంచ్ మెస్రం నిఖిత నగేష్, ఉప సర్పంచ్ ఆత్రం సంతోష్, మాజీ జెడ్పీటీసీ బాపన్న, ప్రకాష్ రావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సీఎం నాయకత్వంలో తెలంగాణ అభివృద్ధి పథంలో ముందుకు సాగాలి : ఆత్రం సుగుణక్క

• రెబ్బెనలో ఘనంగా సీఎం రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు కేక్ కట్ చేసిన డీసీసీ అధ్యక్షురాలు



(రెబ్బెన, సాక్షర): రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలను రెబ్బెన మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేడుకలకు డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క ముఖ్య అతిథిగా హాజరై పార్టీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేశారు.అనంతరం నాయకులు, కార్యకర్తలు ఒకరికొకరు కేక్ తినిపించుకుంటూ, టపాసులు కాల్చి సంబరాలు జరుపుకున్నారు.ఈ సందర్భంగా ఆత్రం సుగుణక్క మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని అన్నారు. ఆరు గ్యారంటీల అమలుతో పాటు ఇందిరమ్మ ఇళ్లు, రైతు సంక్షేమం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్ వంటి పథకాల ద్వారా అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి పథంలో మరింత ముందుకు సాగాలని, రేవంత్ రెడ్డి ఆయురారోగ్యాలతో ప్రజలకు మరిన్ని సేవలందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు కేసరి కిషన్ గౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యులు సోమశేఖర్, దుర్గం దేవాజి, టౌన్ అధ్యక్షుడు దుర్గం రాజేష్, మండల ఉపాధ్యక్షులు బలరాం నాయక్, ఎస్సీ సెల్ అసెంబ్లీ అధ్యక్షుడు జాడి ప్రసాద్, ఎస్టీ సెల్ అధ్యక్షుడు గోపాల్ నాయక్, సీనియర్ నాయకులు, మహిళా నాయకురాళ్లు, యువజన కాంగ్రెస్ నాయకులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

'బబ్లూ XXL' మూవీ నుంచి మ్యాజికల్ ఫస్ట్ స్పార్క్ రిలీజ్



ప్రముఖ నిర్మాతలు పుష్కూర్ రామ్ మోహన్ రావు, భరత్ ఎన్. నారంగ్ నేతృత్వంలోని శ్రీ వెంకటేశ్వర సినిమాస్ సంస్థ 'బబ్లూ XXL' తో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది. యంగ్ ట్యాలెంటెడ్ సుమంత్ ప్రభాస్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రాన్ని జెన్ జెడ్ ప్రేక్షకులను ఆకట్టుకునే ఎంటర్‌టైనర్‌గా రూపొందిస్తున్నారు. సోనాలి నారంగ్ సమర్పణలో తెరకెక్కుతున్న ఈ సినిమా సాయిలు కంపాటి దర్శకుడిగా రెండో సినిమా. ఆయన తొలి చిత్రం 'రాజు వెడ్స్ రాంబాయి' బ్లాక్‌బస్టర్ విజయం సాధించిన విషయం తెలిసిందే. ఇప్పటికే విడుదలైన బబ్లూ XXL టైటిల్, ఫస్ట్ లుక్‌కు మంచి స్పందన లభించింది. దీపావళి వేడుకలకు మరింత ప్రత్యేకతను జోడిస్తూ 'బబ్లూ XXL' మేకర్స్ తాజాగా ఫస్ట్ స్పార్క్‌ను విడుదల చేశారు. బబ్లూ ప్రేమకథ ఎలా మొదలవుతుందో వినోదాత్మకంగా పరిచయం చేస్తూ ఈ గ్లింప్స్‌ను రూపొందించారు. తొలిచూపులోనే ప్రేమ పుట్టే క్షణంలోని మ్యాజిక్‌ను, ఆ సమయంలో కలిగే ఉత్సాహం, ఆసక్తి, అందమైన భావోద్వేగాలను ఈ ఫస్ట్ స్పార్క్ ఎంతో అందంగా ప్రజెంట్ చేస్తోంది. ఈ ఫస్ట్ స్పార్క్ ద్వారా గహజీ ఎస్‌కేను కథానాయికగా పరిచయం చేశారు. బబ్లూతో ఆమెకు ఎదురయ్యే తొలి పరిచయం ఒక ఫ్రెష్ రొమాంటిక్ ట్రాక్‌కు పునాది వేస్తుంది. లీడ్ పెయిర్ మధ్య ఆకట్టుకునే ఆన్‌స్క్రీన్ కెమిస్ట్రీ ఈ గ్లింప్స్‌కు మరింత అందాన్ని తీసుకొచ్చింది. తన పరిచయ సన్నివేశాల్లో గహజీ ఎంతో అందంగా కనిపించి ఆకట్టుకున్నారు. విడుదలైన వెంటనే ఈ ప్రమోషనల్ వీడియోకు పాజిటివ్ రెస్పాన్స్ లభించడంతో సినిమాపై ఆసక్తి మరింత పెరిగింది. సుమంత్ ప్రభాస్ ఈ చిత్రంలో యూత్‌ఫుల్, ఎంటర్‌టైనింగ్ పాత్రలో కనిపించనున్నారు. ఫస్ట్ స్పార్క్‌లో ఆయన సాయిపల్లవి వీరాభిమానిగా పరిచయమయ్యారు. తన సహజమైన కామెడీ టైమింగ్, ఎనర్జిటిక్ స్క్రీన్ ప్రెజెన్స్‌తో పాత్రకు మరింత ఆసక్తిని జోడించారు. 'రాజు వెడ్స్ రాంబాయి' బ్లాక్‌బస్టర్ విజయం తర్వాత రచయిత, దర్శకుడు సాయిలు తన రెండో దర్శకత్వ చిత్రంతో మరోసారి ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. మంచిర్యాల నేపథ్యంలో తెరకెక్కుతున్న 'బబ్లూ XXL'లో రాధికా శరత్‌కుమార్, జయలలిత, శివాజీ రాజా ప్రముఖ పాత్రల్లో నటిస్తున్నారు. విజయ్ బుల్గానిన్ అందించిన సంగీతం, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ఫస్ట్ స్పార్క్‌లోని రొమాంటిక్ మూడ్‌ను మరింత అందంగా ఎలివేట్ చేశాయి. ఈ చిత్రానికి వాజిద్ బేగ్ సినిమాటోగ్రాఫర్‌గా, నరేష్ అడుప ఎడిటర్‌గా, పవన్ కల్యాణ్ ఎల్లపు ఆర్ట్ డైరెక్టర్‌గా, ఆయేషా మరియం కాస్ట్యూమ్ డిజైనర్‌గా పనిచేస్తున్నారు. జానీ, జేడీ కొరియోగ్రఫీ అందిస్తున్నారు. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రాన్ని 2027 ప్రారంభంలో థియేటర్లలో విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు. ఫ్రెష్ రొమాంటిక్, యూత్‌ఫుల్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో 'బబ్లూ XXL' క్రమంగా ప్రేక్షకుల్లో అంచనాలను పెంచుకుంటోంది. నటీనటులు: సుమంత్ ప్రభాస్, గహజీ ఎస్‌కే, రాధికా శరత్‌కుమార్, జయలలిత, శివాజీ రాజా

నందమూరి బాలకృష్ణ 'దాదా' సినిమా స్పెషల్ పోస్టర్ రిలీజ్



గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ తన మోస్ట్ అవేటెడ్ మాస్ ఎంటర్‌టైనర్ 'దాదా'తో ఈ పండగ సీజన్‌లో సందడి చేయడానికి సిద్ధమవుతున్నారు. బ్లాక్‌బస్టర్ చిత్రాల దర్శకుడు గోపీచంద్ మలినేని దర్శకత్వంలో, వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. గతంలో 'వీరసింహారెడ్డి' వంటి విజయవంతమైన చిత్రాన్ని అందించిన బాలకృష్ణ, గోపీచంద్ మలినేని కాంబినేషన్ కావడంతో ఈ హై వోల్టేజ్ కమర్షియల్ ఎంటర్‌టైనర్‌పై అంచనాలు మరింత పెరిగాయి. దీపావళి శుభాకాంక్షలు తెలియజేస్తూ మేకర్స్ ఓ ప్రత్యేక ప్రకటనతో పాటు కలర్‌ఫుల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో బాలకృష్ణతో పాటు బాలీవుడ్ నటి నర్గీస్ ఫక్రీ అలరించారు. ఈ పోస్టర్ ద్వారానే సినిమా ఫస్ట్ సింగిల్ టైటిల్‌ను 'దాదా ధమాకా'గా ప్రకటించారు. ఈ పాటను నవంబర్ 13న విడుదల చేయనున్నారు. లెదర్ జాకెట్, సన్‌గ్లాసెస్‌తో స్టైలిష్, ఫ్లాంబాయంట్ అవతార్‌లో బాలకృష్ణ కనిపిస్తుండగా, అద్భుతమైన అవుట్‌ఫిట్‌లో నర్గీస్ ఫక్రీ గ్లామరస్‌గా మెరిశారు. గ్రాండ్‌గా వెలుగులతో నిండిన బ్యాక్‌డ్రాప్‌లో వీరిద్దరి ఎనర్జిటిక్ పోజులు పండగ వాతావరణాన్ని మరింత ఆకర్షణీయంగా మార్చాయి. దీపావళితోనే వేడుకలు ముగిసిపోవని 'దాదా ధమాకా' రూపంలో మరో మ్యూజికల్ ట్రీట్ అందించబోతున్నామని చిత్రబృందం ప్రకటించింది. ఎస్. తమన్ స్వరపరిచిన ఈ ఫస్ట్ సింగిల్ అదిరిపోయే మ్యూజికల్ ఎక్స్‌పీరియన్స్‌ను అందించనుంది. ఈ చిత్రంలో మంచు మనోజ్, కాజల్ అగర్వాల్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. టాప్ టెక్నికల్ టీం సినిమాకు పనిచేస్తోంది. అరవింద్ ఎస్. కశ్యప్ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, ఏఎస్ ప్రకాష్ ప్రొడక్షన్ డిజైన్ నిర్వహిస్తున్నారు. నవీన్ నూలి ఎడిటర్‌గా వ్యవహరిస్తున్నారు. సాయి మాధవ్ బుర్రా సంభాషణలు రాశారు. రామ్-లక్ష్మణ్, రవివర్మ, వి. వెంకట్ యాక్షన్ సీక్వెన్స్‌లను కంపోజ్ చేస్తున్నారు. ఫస్ట్ సింగిల్‌తో పండగ సందడిని కొనసాగించనున్న 'దాదా' చిత్రం డిసెంబర్ 24న గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల కానుంది. నవంబర్ 13న విడుదల కానున్న 'దాదా ధమాకా'తో సినిమా ప్రమోషన్స్ మరో ఆసక్తికరమైన దశలోకి అడుగుపెట్టనున్నాయి. నటీనటులు: నందమూరి బాలకృష్ణ, మంచు మనోజ్, కాజల్ అగర్వాల్, నర్గీస్ ఫక్రీ

కింగ్ 100' మూవీ నుంచి కర్ణగా అశోక్ సెల్వన్ ఫస్ట్ లుక్



కింగ్ నాగార్జున అక్కినేని కెరీర్‌లో ప్రతిష్టాత్మకమైన 100వ ప్రాజెక్ట్ 'కింగ్ 100', అన్నపూర్ణ స్టూడియోస్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి రా కార్తీక్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రంలో ప్రతిభావంతులైన నటీనటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇప్పటికే ఒక్కో పాత్రను పరిచయం చేయడంపై అంచనాలు పెంచుతోంది. తాజాగా ఈ చిత్రం నుంచి అశోక్ సెల్వన్ ఫస్ట్ లుక్‌ను మేకర్స్ విడుదల చేశారు. కర్ణగా ఆయనలోని వైల్డ్‌నెస్‌ను ప్రజెంట్ చేస్తూ ఈ పోస్టర్‌ను ఆయన పుట్టినరోజు సందర్భంగా ప్రత్యేకంగా రిలీజ్ చేశారు. ఈ ఫస్ట్ లుక్ విడుదలైన వెంటనే అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. పూర్తి ఇంటెన్స్ అవతార్‌లో అశోక్ సెల్వన్ అదిరిపోయారు. స్టైలిష్ మెరూన్ షర్ట్, పొడవాటి జుట్టు, ఒత్తైన గడ్డంతో కుర్చీలో రిలాక్స్‌డ్‌గా కూర్చున్న ఆయన లుక్‌లో అటిట్యూడ్ కనిపిస్తోంది. చేతిలో సిగరెట్, పక్కనే సాధారణంగా ఉంచిన ఖాకీ పోలీస్ యూనిఫామ్, ముందు భాగంలో ప్రముఖంగా కనిపిస్తున్న కింగ్ మూవ్ తో కూడిన చెస్ బోర్డు.. పోస్టర్‌కు మరిన్ని ఆసక్తికరమైన అంశాలను జోడించాయి. డార్క్ సెటప్ పోస్టర్‌లోని మిస్టీరియస్ అప్పీల్‌ను మరింత పెంచాయి. అశోక్ సెల్వన్ పుట్టినరోజును పురస్కరించుకుని మేకర్స్ ఆయనను మునుపెన్నడూ చూడని సరికొత్త అవతార్‌లో పరిచయం చేశారు. ఈ పాత్ర కోసం ఆయనలో వచ్చిన ట్రాన్స్‌ఫర్మేషన్ 'కింగ్ 100'కు మరో ఆసక్తికరమైన కోణాన్ని జోడించింది. ఈ ఫస్ట్ లుక్‌తో కర్ణ పాత్ర ఎలా ఉండబోతోంది? కథలో ఆయన పాత్ర ఎలాంటి ప్రభావం చూపించనుంది? అనే ఆసక్తి ప్రేక్షకుల్లో నెలకొంది. రాక్‌స్టార్ దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తుండగా, రాజా మహదేవన్ సినిమాటోగ్రఫీ నిర్వహిస్తున్నారు. నవీన్ నూలి ఎడిటర్‌గా, సతీష్ కుమార్ ఎన్ ప్రొడక్షన్ డిజైనర్‌గా పనిచేస్తున్నారు. నాగార్జున, టబు, అశోక్ సెల్వన్ వంటి వెర్సటైల్ స్టార్స్ భాగమైన 'కింగ్ 100' ఇప్పటికే ప్రమోషనల్ కంటెంట్‌తో మంచి అంచనాలను పెంచుతోంది. ఈ చిత్రం 2026 డిసెంబర్ 24న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల కానుంది. నటీనటులు: కింగ్ నాగార్జున, టబు, అశోక్ సెల్వన్

ఘనంగా 'శివాలయం' మూవీ టీజర్, పోస్టర్ లాంచ్



తెలుగు ప్రేక్షకులను భక్తిరసంతో అలరించేందుకు మరో ఆధ్యాత్మిక చిత్రం సిద్ధమవుతోంది. భక్తి, ఆధ్యాత్మికత, భావోద్వేగాల సమ్మేళనంగా శ్రీ శివసాయి ఫిలిమ్స్, శ్రీమతి శ్రీ లక్ష్మినర్సింహారెడ్డి చిత్రాలయం సంయుక్త బ్యానర్‌లపై తెరకెక్కుతున్న చిత్రం 'శివాలయం'. ఈ సినిమా టీజర్, పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్‌లో ఘనంగా జరిగింది. ఈ వేడుక కోసం చిత్ర బృందం ప్రత్యేకంగా శివాలయం సెట్‌ను ఏర్పాటు చేయడం విశేష ఆకర్షణగా నిలిచింది. 'శివాలయం' మూవీ టీజర్, పోస్టర్ లాంచ్ వేడుకలో ముఖ్య అతిథులుగా నిర్మాతలు ఈద (EEDA) రవి రాజా, సాయిలక్ష్మణ్ అల్లు, నబీ షేక్, పి.నాగలక్ష్మి, కుప్పిలి శ్రీనివాస పాల్గొని చిత్రయూనిట్‌కు శుభాకాంక్షలు అందించారు. సినిమా భారీ హిట్ సాధించాలని ఆకాంక్షించారు. 'రంగస్థలం' ఫేమ్ ఆచంట మహేష్, కాంచన దీప్తిరెడ్డి, ధన్‌రాజ్, సుష్మ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి వెంకట్‌రెడ్డి నంది దర్శకత్వం వహిస్తున్నారు. వెంకట్‌రెడ్డి నందితో పాటు కళ్లెం నర్సింహారెడ్డి నిర్మాణ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా నటుడు ఘర్షణ శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రస్తుతం సినిమా నిర్మించి విడుదల చేయడం సవాలుగా మారిన పరిస్థితుల్లోనూ దర్శకుడు వెంకట్‌రెడ్డి వరుసగా సినిమాలు రూపొందిస్తూ ప్రేక్షకుల ముందుకు తీసుకురావడం అభినందనీయమన్నారు. ఆయన మంచి ప్రతిభావంతుడైన దర్శకుడని, 'శివాలయం' సినిమాను ప్రేక్షకులు ఆదరించి విజయవంతం చేయాలని కోరారు. సీనియర్ నటుడు నాగ మహేష్ మాట్లాడుతూ.. ఈ చిత్రంలో తనకు మంచి పాత్రతో పాటు ఓ పాటలో నటించే అవకాశం కల్పించిన దర్శకుడు వెంకట్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. సినిమా ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు. సంగీత దర్శకుడు డ్రమ్స్ రాము మాట్లాడుతూ.. ఈ చిత్రంలో మూడు పాటలు ఉన్నాయని, సంగీత దర్శకుడిగా అవకాశం కల్పించిన దర్శక నిర్మాతలకు ధన్యవాదాలు తెలిపారు. హీరో ఆచంట మహేష్ మాట్లాడుతూ.. అతి తక్కువ సమయంలోనే చిత్రాన్ని పూర్తి చేయడం ఆనందంగా ఉందన్నారు. నిర్మాత కళ్లెం నర్సింహారెడ్డి గొప్ప వ్యవసాయవేత్త అని, నందమూరి తారక రామారావుతో కలిసి పనిచేసిన అనుభవం ఉన్న ఆయన తమ చిత్రాన్ని నిర్మించడం గర్వకారణమని పేర్కొన్నారు. హీరోయిన్ దీప్తిరెడ్డి మాట్లాడుతూ.. తనకు ఈ చిత్రంలో అవకాశం కల్పించిన దర్శక నిర్మాతలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రేక్షకుల ప్రేమ, ఆదరణ తమకు ఎంతో ముఖ్యమని అన్నారు. మరో హీరోయిన్ సుష్మ మాట్లాడుతూ.. సినిమాలో అన్ని రకాల అంశాలు ఉన్నాయని, ప్రేక్షకులను తప్పకుండా ఆకట్టుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నటుడు దిల్ రమేష్ మాట్లాడుతూ.. తక్కువ రోజుల్లోనే సినిమాను పూర్తి చేసిన దర్శకుడు వెంకట్‌రెడ్డిని అభినందించారు. తెలుగు నటీనటులు, సాంకేతిక నిపుణులకు అవకాశాలు కల్పించడం సంతోషకరమన్నారు. 89 ఏళ్ల వయసులోనూ ఎంతో నిబద్ధతతో సినిమాను నిర్మిస్తున్న నిర్మాత కళ్లెం నర్సింహారెడ్డికి పాదాభివందనం చేస్తున్నట్టు తెలిపారు. ఈ చిత్రంలో ఘర్షణ శ్రీనివాస్, సమ్మెట గాంధీ, మురం రెడ్డి వెంకటేశ్వర్లు, మధుమతి కొక్కంటి, ముత్యాల ఉమా, చిట్టిబాబు, దిల్ రమేష్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. బ్యానర్: శ్రీ శివసాయి ఫిలిమ్స్, శ్రీమతి శ్రీలక్ష్మినర్సింహారెడ్డి చిత్రాలయం

ఇడుపు కాయితం" సినిమా నుంచి 'బారాత్ బీట్..' సాంగ్ రిలీజ్

డిసెంబర్ 11న వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు వస్తున్న మూవీ ప్రొడ్యూసర్ బన్నీ వాస్, జీనియస్ డైరెక్టర్ సుకుమార్ తమ బన్నీ వాస్ వర్క్స్, సుకుమార్ రైటింగ్స్ బ్యానర్స్ పై ప్రియదర్శి హీరోగా నిర్మిస్తున్న సినిమా "ఇడుపు కాయితం". ఈ సినిమాలో ఫోక్ సాంగ్స్ ద్వారా పేరు తెచ్చుకున్న నటి నాగదుర్గ హీరోయిన్ గా నటిస్తోంది. ఫ్యామిలీ బ్యాక్ డ్రాప్ స్టోరీతో ఎంటర్ టైనింగ్ డ్రామాగా "ఇడుపు కాయితం" సినిమాను యువ దర్శకుడు వంశీరెడ్డి దొండపాటి రూపొందిస్తున్నారు. ఈ సినిమా డిసెంబర్ 11న వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. ఈ రోజు దీపావళి పండుగ సందర్భంగా ప్రేక్షకులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ మేకర్స్ "ఇడుపు కాయితం" సినిమా నుంచి 'బారాత్ బీట్..' సాంగ్ రిలీజ్ చేశారు. మ్యూజిక్ డైరెక్టర్ సురేష్ బొబ్బిలి అదిరే బీట్ తో 'బారాత్ బీట్..' సాంగ్ కంపోజ్ చేశారు. శ్రీలత (నాగదుర్గ), శ్రీనివాస్ (ప్రియదర్శి) పెళ్లి బారాత్ సందర్భంగా వచ్చే డ్యాన్స్ నెంబర్ గా ఈ సాంగ్ ను రూపొందించారు. ఈ పాటలో నాగదుర్గ మాస్ డ్యాన్స్ స్టెప్స్ హైలైట్ గా నిలుస్తున్నాయి. థియేటర్స్ లో ఈ పాటకు ఆడియెన్స్ స్టెప్స్ వేయబోతున్నారు. నటీనటులు - ప్రియదర్శి, నాగదుర్గ, శివజ్యోతి (తీన్మార్ సావిత్రి), సుజాత (జోర్దార్), చంద్రవ్వ, మౌనిక రెడ్డి, రచ్చరవి, బిత్తిరి సత్తి, అభయ్ బేతిగంటి, మైమ్ మధు, తదితరులు

Printed, Published, Edited and Owned by A. Linganna, Printed at EVR Printers, Vidyanagar, Adilabad - 504001. Telangana.
Published at D.No. 5-91/2, Talamadugu (Vill & Mandal) Adilabad - 504312. A.P. RNI No. APTEL/2011/42149. Editor A. Linganna.
Phone: 08732-231345. Email: Saaksharaadb@gmail.com